

www.vibharenews.com

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | శనివారం 01 మే 2021 | సంపుటి : 02 | సంచిక : 291 | పేజీలు : 4 | వెల : రూ 3-00

## ఆసుపత్రులనూ క్రిమినల్ కేసులు నమోదు

కడప కడపలో ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించిన కొమ్మ సూపర్ స్పెషాలిటీ, కేసీహెచ్ సూపర్ స్పెషాలిటీ ప్రైవేటు కొవిడ్ ఆసుపత్రులపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. కొంత మందిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఆసుపత్రికి వచ్చిన బాధితుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు రావడంతో.. కడప విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో ఆరోపణలు రుజువు కావడంతో విజిలెన్స్ అధికారులు నివేదికను పోలీసులకు అందజేశారు. ఈ మేరకు రెండు ఆసుపత్రుల పై క్రిమినల్ కేసులు నమోదు చేశామని ఎస్పీ తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# నాడు-నేడుపై సీఎం జగన్ సమీక్ష




**నాడు-నేడు మనబడి పనుల్లో పూర్తి నాణ్యత పాటించాలి**
**అన్ని స్కూళ్ల పనుల్లో నాణ్యతను తనిఖీ చేయాలి**
**మే చివరి నాటికి నాడు-నేడు మొదటి దశ పనులు పూర్తవ్వాలి**
**జూలైలో స్కూళ్లు తెరిచే నాటికి విద్యా కానుక కిట్లు సిద్ధం చేయాలి**
**విద్యార్థుల మంచి కోసమే పరీక్షల నిర్వహణ**

అమరావతి: నాడు–నేడు (పాఠశాల విద్యాశాఖ)పై క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. నాడు–నేడు మనబడి మొదటిదశలో 15,715 స్కూళ్లలో చేపట్టిన పనుల పురోగతిని సీఎం జగన్ క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు. పనులు దాదాపు పూర్తయ్యే దశలో ఉన్నాయన్న అధికారులు, ఆ వివరాలను ప్రజెంటేషన్‌లో చూపారు. ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. "రూపురేఖలు మార్చుకుంటున్న స్కూళ్లు మరింత ఆకర్షణీయంగా కనిపించేలా పాఠశాలల గోడలకు వేసినట్లు, బిల్డింగ్‌పై కూడా పెయింటింగ్స్ వేయండి. నాడు–నేడు పనులు పూర్తయ్యాక, ప్రతి స్కూల్‌లో నాడు ఆ స్కూల్ ఎలా ఉంది.. ఇప్పుడెలా ఉంది అన్న ఫోటోలు తప్పనిసరిగా ప్రదర్శించాలి. అప్పుడే ఇప్పుడు చేసిన పనులకు మరింత విలువ వస్తుంది. వాటి ప్రాధాన్యత తెలుస్తుంది. అదే విధంగా ఇప్పుడు ఆ స్కూల్‌ను ఎలా నిర్వహించాలన్న దానిపైనా వారికి అవగాహన కలుగుతుందివవ అన్నారు."స్కూళ్లలో పెయింటింగ్ పనులు, స్మార్ట్ టీవీలు, వాల్ ఆర్ట్‌తో సహా అన్ని పనులు తప్పనిసరిగా మే చివరి నాటికి పూర్తి కావాలి .పనుల నాణ్యతలో ఎక్కడా లోపం ఉండకూడదు. అందుకే పేరెంట్స్ కమిటీలు కూడా ఏర్పాటు చేయడం జరిగింది.నాడు–నేడులో ప్రభుత్వం నిర్దేశించుకున్న విధంగా పనులు జరగాలి. వాటిలో ఎక్కడా తేడా ఉండకూడదు.అలాగే మే, జూన్ నెలల్లో పూర్తిగా పనులు నాణ్యతను చూడాలి. ప్రతి స్కూల్ సందర్శించాలి. అన్నీ నోట్ చేయాలి. క్వాలిటీ ఆడిట్ పూర్తి కావాలి. టాయిలెట్ నిర్వహణ వ్యవస్థ కూడా స్కూళ్లు తెరిచే నాటికి పూర్తి కావాలి అని తెలిపారు."ఇంగ్లిష్ మీడియమ్‌లో బోధన సజావుగా జరిగేలా టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలి.అప్పుడే వారు ఏ ఇబ్బంది లేకుండా ఇంగ్లిష్‌లో పాఠాలు చెప్పగలుగుతారు.పిల్లలు స్కూళ్లకు వచ్చే నాటికే విద్యా కానుక కూడా రెడీ కావాలి.ఈసారి కిట్లలో ఇంగ్లిష్ డిక్షనరీ కూడా తప్పనిసరిగా ఉండాలి. విద్యా కానుక కింద ఇస్తున్న కిట్లలో ప్రతి ఒక్కటీ పూర్తి నాణ్యత కలిగి ఉండాలి.జూలైలో స్కూళ్లు తెరవగానే, నాడు–నేడు మనబడి రెండో దశ పనులు మొదలు కావాలివవ అని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసమే టెన్త్, ఇంటర్ పరీక్షల నిర్వహణ: సీఎం

కాగా, ఈ సమీక్షలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణను కూడా సీఎం జగన్ ప్రస్తావించారు. ఎందుకు అన్నది చెప్పాలి:"ఏ పరిస్థితిలో ఎందుకు పరీక్షలు పెడుతున్నామన్నది చెప్పాలి. నిన్న కేరళలో 10వ తరగతి పరీక్షలు పూర్తి చేశారు. పదవ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై కేంద్రం ఏ విధానాన్ని ప్రకటించలేదు. నిర్ణయాన్ని రాష్ట్రాలకే వదిలేసింది. దాంతో రాష్ట్రాలు స్వయంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయి. కొన్ని రాష్ట్రాలు పరీక్షలు నిర్వహిస్తుండగా, మరి కొన్ని రాష్ట్రాలు పరీక్షలను రద్దు చేశాయివవ అన్నారు.పరీక్షలతో కలిగే ప్రయోజనం:"పరీక్ష పెట్టని రాష్ట్రాలు విద్యార్థులకు కేవలం పాస్ మార్కులు మాత్రమే ఇస్తున్నాయి. అదే పరీక్షలు జరిగితే విద్యార్థులకు మంచి మార్కులు వస్తాయి. అలాంటప్పుడు మంచి కాలేజీల్లో వారికి సీట్లు ఎలా వస్తాయి.. పరీక్ష రాసిన వారికి 70 శాతం పైగా మార్కులు వస్తే, సీట్లు వారికే వస్తాయి కదా. కేవలం పాస్ మార్కులతో బయటపడిన విద్యార్థుల 50 ఏళ్ల భవిష్యత్తు ఏమిటివ అని సీఎం జగన్ ప్రశ్నించారు.మంచి చేయాలనే:"విద్యార్థులకు మంచి చేయాలన్న తపనతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. నిజానికి పరీక్షల రద్దు చేయడం చాలా సులభం. పరీక్షల నిర్వహణ ఇంకా బాధ్యతతో కూడుకున్నది. కోవిడ్ జాగ్రత్తలు తీసుకుని పరీక్షలు నిర్వహించాలి. కేవలం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాత్రమే పరీక్షలు నిర్వహిస్తున్నాముదవ అన్నారు.టీచర్లు గుర్తించాలి:"విద్యార్థుల మంచి భవిష్యత్తు కోసమే పరీక్షలపై నిర్ణయం తీసుకున్నామన్న విషయాన్ని ప్రతి టీచర్ గుర్తించాలి. ఇందులో అందరి సహాయ సహకారాలు కావాలని, తోడ్పాటు కావాలన్న విషయాన్ని వారందరికీ బలంగా చెప్పండి. అలాగే పరీక్షల కోసం అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడా ఏ మాత్రం అలక్ష్యం చూపొద్దు. అన్ని కోవిడ్ జాగ్రత్తలతో ఈ పరీక్షలు నిర్వహించాలివ అని సీఎం జగన్ సూచించారు. విద్యా శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుడితి రాజశేఖర్, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వాడ్రేవు చినవీరభద్రుడు, సర్వశిక్ష అభియాన్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వెట్రిసెల్వి, ఇతర ఉన్నతాధికారులు సమీక్షకు హాజరయ్యారు.

# మహిళాసాధికారతకు ఉపరాష్ట్రపతి 'ఎడ్యుకేట్, ఎన్‌లైటెన్, ఎంపవర్ మంత్రం



న్యూఢిల్లీ: ప్రస్తుతం మహిళా శ్రామికశక్తి 20 శాతం మేర మాత్రమే ఉందని, భారతదేశ అభివృద్ధిని మరింత వేగవంతం చేసేందుకు ఈ లింగబేధాన్ని పక్కన పెట్టి, సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పారిశ్రామిక రంగానికి పిలుపునిచ్చారు. మహిళాసాధికారతకు, ఎడ్యుకేట్ (విద్యావంతులు కావడం), ఎన్‌లైటెన్ (జ్ఞానాన్ని సముపార్జించడం), ఎంపవర్ (సాధికారిత సంపాదించడం) అనే త్రిపద సూత్రాన్ని ప్రతిపాదించిన ఉపరాష్ట్రపతి, మహిళలు మన దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే దిశగా ఈ మంత్రం మార్గనిర్దేశనం చేస్తుందన్నారు. ఫిక్కీ మహిళా సంస్థ (ఎఫ్ఐసీసీఐ– ఎఫ్ఎల్ఓ) హైదరాబాద్ చాప్టర్ నిర్వహించిన, 'వందేమాతరం–ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌వ కార్యక్రమంలో ఉపరాష్ట్రపతి అంతర్జాల మాధ్యమం ద్వారా ప్రసంగించారు. మనం అద్భుతమైన మానవ వనరులను కలిగి ఉన్నామన్న ఆయన, అందులో మహిళ పాత్ర కూడా మరింత కీలకమనే విషయాన్ని విస్మరించకూడదని తెలిపారు. మహిళల నేతృత్వంలో వేగవంతమైన పారిశ్రామిక వృద్ధి సాధ్యమని నొక్కి చెప్పిన ఆయన, భారతదేశ ఆర్థిక వ్యవస్థను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్న ఆయన, మహిళలు భారతదేశ భావి వృద్ధి నిర్దేశకులు అని తెలిపారు.పనిచేసే ప్రదేశాల్లో మహిళలు తమ పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోవడానికి ఉన్న అడ్డంకులను, సమస్యలను పరిశీలించి, పరిష్కరించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పిన ఉపరాష్ట్రపతి, కరోనా మహమ్మారి వల్ల లింగ వివక్ష మరింత పెరుగుతోందని పేర్కొన్నారు. మహిళలను మరింత శక్తి వంతం చేయడానికి ప్రాతినిధ్యం, వేతనం, అవకాశం వంటి అంశాల్లో వారి ప్రాధాన్యత పెంచాలని సూచించారు. వేతన అసమానతల సమస్యను ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, సమాన పనికి సమాన వేతనం అనేది నేటికీ ఓ ప్రాథమిక డిమాండ్‌గా కొనసాగడం బాధాకరమని, ఈ వివక్ష అభివృద్ధి చెందిన దేశాలతో పాటు, కార్పొరేట్ రంగంలోనూ నేటికీ పరిష్కారానికి నోచుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ యొక్క 'గ్లోబల్ జెండర్ గ్యాప్ రిపోర్ట్ 2020వని ప్రస్తావించిన ఉపరాష్ట్రపతి, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో కూడా 15శాతం వేతన అసమానతలున్నట్లు ఈ నివేదిక తెలియజేస్తోందని, ఇప్పటి వరకూ ఏ దేశమూ వేతనాల్లో లింగ సమానత్వాన్ని సాధించలేకపోయిందని అభిప్రాయపడ్డారు. లింగ వివక్షను రూపుమాపే విషయంలో భారత్ ముందుండాలని ఆకాంక్షించిన ఉపరాష్ట్రపతి, ప్రగతిశీల ప్రసూతి ప్రయోజన (సవరణ) చట్టం – 2017 ను ప్రశంసించారు. జీతంతో కూడిన ప్రసూతి సెలవులను 12 వారాల నుంచి 26 వారాలకు పెంచడం ద్వారా అభివృద్ధి చెందిన దేశాలకు కూడా ఇది మార్గం చూపించిందన్నారు. మాతృత్వం, పిల్లల సంరక్షణ కొనసాగిస్తూనే తమ కర్తవ్యాలను నిర్వహించే మహిళల విషయంలో వేతన లింగ వ్యత్యాసాన్ని తగ్గించడానికి ఈ చట్టం సహాయపడుతుందని అభిప్రాయపడ్డారు.

# టెన్త్, ఇంటర్ పరీక్షలపై ఏపీ హైకోర్టు కీలక వ్యాఖ్యలు




అమరావతి: ఇంటర్, టెన్త్ పరీక్షలపై ఏపీ హైకోర్టులో సుదీర్ఘ విచారణ జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇంటర్ పరీక్షలపై ప్రభుత్వం పున:పరిశీలన చేసుకోవాలని హైకోర్టు సూచించింది. పిటిషనర్ల తరపున సీనియర్ కౌన్సిల్ చేసిన వాదనలో.. చాలా అంశాలు ముడిపడి ఉన్నాయని కోర్టు అభిప్రాయపడింది. దాదాపు 30 లక్షల మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు.. పరీక్షల్లో భాగం కావాల్సి ఉందని పేర్కొంది. అందువల్ల ప్రభుత్వం వెంటనే పున:పరిశీలన చేసుకోవాలని సూచించింది. కేసు విచారణను హైకోర్టు మే 3వ తేదీకి వాయిదా వేసింది. అదే రోజు ప్రభుత్వ అభిప్రాయం చెప్పాలని ఆదేశించింది. మే 2లోపు ప్రభుత్వం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది.కొవిడ్ వచ్చిన విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. నిబంధనల ప్రకారం హోం ఐసోలేషన్‌లో ఉండాలి కదా? అని ప్రభుత్వాన్ని నిలదీసింది. వారికి ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వ న్యాయవాది పేర్కొన్నారని... అదెలా సాధ్యమవుతుందని ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. కొవిడ్ వచ్చిన వారు మానసికంగా పరీక్ష రాయగలుగుతారా? అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇతర రాష్ట్రాల్లో పరీక్షలువాయిదా లేదా రద్దు చేసిన విషయంతోపాటు..రాష్ట్రంలో కేసులు పెరుగుతున్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించింది.

# కార్మికులకు మే డే శుభాకాంక్షలు: పవన్

అమరావతి: కార్మిక లోకానికి జనసేన తరపున మే డే శుభాకాంక్షలు తెలుపుతున్నామని ఆ పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ



ప్రపంచ పురోగతిలో శ్రమ జీవుల పాత్ర ఎనలేనిదని కొనియాడారు. మా శ్రమను గుర్తించండి అని కష్ట జీవులు.. పోరాటానికి దిగే పరిస్థితి రాకూడదన్నారు. కార్మిక చట్టాలు పకడ్బందీగా అమలు కావాలన్నదే జనసేన ఆకాంక్ష అని పేర్కొన్నారు. కరోనా సెకండ్ వేవ్ కారణంగా ఇబ్బంది పడుతున్న కార్మికుల.. కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత పాలకులపై ఉందని పవన్‌కల్యాణ్ డిమాండ్ చేశారు.


# కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు

అమరావతి: ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మికులకు టీడీపీ అధినేత చంద్రబాబు మేడే శుభాకాంక్షలు తెలిపారు. సీఎం జగన్ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని, జగన్ చేతగానితనంతో లక్షలాది మంది.. భవన నిర్మాణ కార్మికులు రోడ్డునపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్న క్యాంటీన్ల ద్వారా పనుల్లేని పేదల ఆకలి తీర్చామని, కార్మికుల సంక్షేమం కోసం టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు.



# చాలా గొప్పగా ప్రజారాజధాని ఉద్యమం: దేవినేని

అమరావతి: 178 మంది రైతులు బలిదానాలు 500 రోజుల ఉద్యమ ఫలితమని మాజీ మంత్రి దేవినేని ఉమ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ ఈ రోజు రాజధాని విశాఖకు తరలిపోవడం లేదంటే అది రైతుల, దళితుల ఉద్యమ ఫలితమని చెప్పుకొచ్చారు. ప్రజా రాజధాని ఉద్యమం చాలా గొప్పగా సాగుతుందని అన్నారు. జాతీయ నాయకులు కూడా వర్చువల్ బహిరంగ సభలో భాగస్వాములు అవుతున్నారని తెలిపారు. ఒక వైపు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఇక్కడ శంకుస్థాపన నిన్ననే చేసిందన్నారు. 6 ఎస్సి నియోజకవర్గాల మధ్యలో అమరావతి రాజధాని ఉందని అన్నారు. న్యాయపోరాటం ద్వారా న్యాయం, ధర్మం విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చంద్రబాబు కూడా వర్చువల్ బహిరంగ సభలో పాల్గొంటారని దేవినేని ఉమ వెల్లడించారు.



# రెమిడెసివిర్ కొరత: కేంద్రం కీలక నిర్ణయం

**వివిధ దేశాలనుంచి దిగుమతి**
**నాలుగున్నర లక్షల రెమిడెసివిర్ వయల్స్ దిగుమతి**
**తొలివిడతగా 75వేల రెమిడెసివిర్ వయల్స్**
**దేశానికి రానున్నాయి**



న్యూఢిల్లీ: దేశంలో కరోనా విజృంభణ, కరోనా చికిత్సలో ప్రధానమైన యాంటీ వైరల్ డ్రగ్ రెమిడెసివిర్‌కు ఏర్పడిన తీవ్ర కొరత నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. ఇతర దేశాల నుండి రెమిడెసివిర్‌ను దిగుమతి చేసుకోవడం ప్రారంభించింది. ఈ క్రమంలో 4,50,000 మోతాదులను దిగుమతి చేసుకోనుంది. మొదటి విడతగా 75 వేల రెమిడెసివిర్ వయల్స్‌ను శుక్రవారం రిసీవ్ చేసుకోనుంది. దేశంలో భారీగా నమోదవుతున్న పాజిటివ్ కేసులతో రెమిడెసివర్ దిగుమతులపై దృష్టిపెట్టడంతో పాటు ఇప్పటికే దేశీయంగా ఈ ఔషధం ఎగుమతిని కేంద్రం నిషేధించిందిభారత ప్రభుత్వ యాజమాన్యంలోని హెచ్ఎల్ఎల్ లైఫ్‌కేర్ లిమిటెడ్, అమెరికాకు చెందిన గిలియడ్ సైన్సెస్, యు ఈజిప్టు ఫార్మా మేజర్ ఇవా ఫార్మా సంస్థలనుంచి వీటిని కొనుగోలు చేయనుంది. రాబోయే ఒకటి రెండు రోజుల్లో గిలియడ్ సైన్సెస్ నుంచి భారత్‌కు 75వేల నుంచి లక్ష వయల్స్ వస్తాయని, మే 15లోగా లక్ష వయల్స్ చేరుతాయని కేంద్ర కెమికల్స్, ఫర్టిలైజర్స్ శాఖ తాజాగా ప్రకటించింది. వెల్లడించింది. అలాగే ఎవా ఫార్మా తొలుత పది వేల వయల్స్ దేశానికి అందించనుంది. జూలై వరకు ప్రతీ15 రోజులకొకసారి 50వేల వయల్స్‌ను వరకు మనదేశానికి పంపిస్తుందని కేంద్రం తెలిపింది.

# వైఎస్సార్‌సీపీ నేత రెహ్మాన్ మృతి..

**సీఎం జగన్ సంతాపం**

అమరావతి: వైఎస్సార్‌సీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ హెచ్ ఏ రెహమాన్ గుండెపోటుతో మృతి చెందారు. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ.. శుక్రవారం మధ్యాహ్నం కన్ను మూశారు. ఆయన మృతి పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రెహమాన్‌కు పార్టీతో కల సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పార్టీ కోసం ఆయన ఎంతో కృషి చేశారని తెలిపారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటన్నారు.



# సంపాదకీయం

శనివారం 01 మే 2021

## వ్యాక్సిన్ పై రాజకీయాలా...

వరస లాక్ డౌన్ లు , కఠిన కర్ఫ్యూలకు దేశం సిద్ధమవుతోంది. ఇప్పటికే మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక లాక్ డౌన్ లు పాటిస్తున్నాయి. దాదాపు ఏడెనిమిది రాష్ట్రాల్లో రాత్రుళ్లు కర్ఫ్యూ అమలు అవుతోంది. మరోవైపు సమాఖ్య వ్యవస్థగా ఉన్న భారత్ లో తంపులు పెట్టేందుకు రాజకీయ పార్టీలు తెగిస్తున్నట్లుగా కనిపిస్తోంది. తెలుగు రాష్ట్రాలకు ఆక్సిజన్ ఆపేయాలని తమిళనాడు ముఖ్యమంత్రి కోరడం విడ్డూరం. దాయాదుల తరహాలో అసూయ, స్వార్థంతో రగులుతున్నాయి రాష్ట్రాలు. తమ వైఫల్యాలను వేరే కోణంలోకి మళ్లించేందుకు నాయకత్వాలు తెలివైన ఎత్తుగడలు వేస్తున్నాయి. ఇదొక ప్రమాదకరమైన సంకేతం. తమ కష్టాలకు ఇరుగుపొరుగు రాష్ట్రాలే కారణమని నిందించేందుకు సిద్ధమవుతున్నాయి. ఆయా రాష్ట్రాల కారణంగానే తమ ప్రాంతాల్లో వ్యాధి ప్రబలిందనే సాకులు వెదుకుతున్నాయి. ప్రతి పనిలోనూ క్రెడిట్ తన ఖాతాలోనే పడాలని కోరుకునే ప్రధానమంత్రి, ఆయనపై వ్యక్తిగతంగా కక్ష కట్టిన ప్రతిపక్షాలు కలిసి దేశంలో అసలు సమస్యను మరుగున పెడుతున్నాయి. వాక్సిన్లు, అత్యవసర ఉపకరణాలు రాజకీయ ప్రాధాన్యతలతో పంపిణీ అవుతున్నాయంటూ కేంద్రంపై రాష్ట్రాలు ధ్వజమెత్తుతున్నాయి. ఇది చాలా బాధాకరమైన అంశం. ఏ ప్రాతిపదికన వైద్య సరఫరాలలో వ్యత్యాసం పాటిస్తున్నారో చెప్పేందుకు కేంద్రం ఇంతవరకూ ప్రయత్నించలేదు. దీనివల్ల ప్రజల్లో అపోహలు తలెత్తుతాయి. దాని ప్రభావం దీర్ఘకాలం ఉంటుంది. నిజంగానే తాము అధికారంలో లేని రాష్ట్రాల పట్ల వివక్ష పాటిస్తుంటే అంతకంటే దేశద్రోహం మరొకటి ఉండదు. పారదర్శకంగా ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటనలు చేయాల్సిన అవసరం ఉంది.ఇంతటి తీవ్ర విపత్తును గతంలో ఎదుర్కొన్న అనుభవం లేకపోవడం కారణంగా ప్రభుత్వాలు పలాయనం పఠిస్తున్నాయి. తప్పనిసరి చర్యలను తీసుకుంటున్నారు. ఇవి తాత్కాలికమే తప్ప పూర్తి స్థాయి అదుపుకు సరిపోవని వైద్యరంగం ఘోషిస్తోంది. గడచిన రెండు దశాబ్దాలుగా ప్రభుత్వాలు ప్రయివేటు వైద్యాన్ని ప్రోత్సహిస్తూ తమ బాధ్యత తప్పించుకుంటూ వచ్చాయి. ఫలితం ఇప్పుడు కనిపిస్తోంది. తీవ్ర అంటురోగాలు ప్రబలినప్పుడు ప్రయివేటు ఆసుపత్రులు యథేచ్ఛగా దోపిడీకి తెరతీస్తాయన్న వాస్తవం కళ్లముందు నిలిచింది. ఆరోగ్యశ్రీలు ఇతర సేవల పేరిట ప్రయివేటు ఆసుపత్రులకే నిధులు చెల్లించడం దశాబ్దకాలంగా తెలుగు రాష్ట్రాల్లో అమలవుతోంది. పైకి చూస్తే ఇది పేదలకు కార్పొరేట్ వైద్యం అందించినట్లు కనిపించినా ప్రభుత్వ ఆసుపత్రుల సేవలు కుచించుకుపోవడానికి కారణమైంది. ప్రయివేటు వైద్య రంగంపై సర్కారీ నియంత్రణ అసాధ్యమైన స్థితికి చేరుకుంది. ప్రభుత్వాల పెద్దలే తమకు తెలిసిన వారి కోసం కార్పొరేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. రికమెండేషన్లు చేస్తున్నారు. ప్రభుత్వ వైద్యం అంటే అగ్రనాయకులకు, నాయకులకు నమ్మకం లేకుండా పోయింది. గతంలో నరసింహన్ గవర్నర్ గా ఉన్నప్పుడు గాంధీ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని ఆదర్శంగా నిలిచారు. అటువంటి ఉదాహరణలిప్పుడు కావాలి.వైద్య రంగంలో రాజకీయ ప్రమేయం సాధ్యమైనంత వరకూ తగ్గాలి. ఈ రంగంలో లబ్ధ ప్రతిష్టులైన వారితో కమిటీలను ఏర్పాటు చేసి , వారిచ్చే సూచనల మేరకే నిర్ణయాలు తీసుకోవాలి. దానిని బహిరంగ పరచాలి . కానీ ఏం చేసినా తమకే లబ్ధి చేకూరాలనే తాపత్రయంతో నాయకులు నిపుణుల సలహాలు, సూచనలను ప్రాచుర్యంలోకి తేవడం లేదు. కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో వైద్య నిపుణుల బృందాలే కరోనా కట్టడికి చర్యల ప్రణాళిక రూపొందించాలి. దానిని వారే ప్రకటించాలి. అప్పుడే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న అపోహలు, అనుమానాలు తొలగి పోతాయి. రాష్ట్రాల మధ్య విభేదాలు తగ్గుతాయి. వాక్సిన్లు పంపిణీ వంటి వాటిని సాధికారికంగా, పారదర్శకంగా చేయడానికి వీలవుతుంది. ప్రధాని, ముఖ్యమంత్రులు తమ రాజకీయ పాత్రను పక్కనపెట్టి ఇటువంటి సంక్షోభ సమయంలో ఫెసిలిటేటర్ పాత్రను పోషించాలి. వైద్య రంగానికి అవసరమైన నిధులు, ఉపకరణాలు సమకూర్చడానికే పరిమితమవ్వాలి. నిర్ణయాలు, అమలు నిపుణులకే అప్పగించాలి. అమెరికా వంటి పాశ్చాత్య దేశాల్లో ఈ విషయంలో కొంత మెరుగైన పద్ధతులు అమలు చేస్తున్నారు. భారత్ లో ఆ చొరవ కొరవడింది. ఆక్సిజన్ ప్లాంట్ల ఏర్పాటు, వాక్సిన్ల ఉత్పత్తి అన్నిటికీ రాజకీయ నిర్ణయం తప్పనిసరి అన్నట్లు రెడ్ టేపిజం అమలు చేస్తున్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగాల్లో నిజాయతీ పరులే లేరా ? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ప్రతి రాష్ట్రంలోనూ పది మంది ఐ ఎ ఎస్, ఐపీఎస్ లతో కూడిన పర్యవేక్షణ బృందాలను , వైద్య నిపుణులతో కూడిన కార్యాచరణ బృందాలను ఏర్పాటు చేసి నిత్యం నిఘా పెట్టి నిర్ణయాలు తీసుకుంటూ ఉంటే పరిస్థితులు మెరుగు పడతాయి. ఆయా బృందాలకు అవసరమైన అధికారాలు కల్పించాలి. కేంద్రం వద్ద సైతం ఆయా రాష్ట్రాల లో పనిచేసే బృందాలకు మార్గదర్శకత్వం వహించే సీనియర్ అధికారుల బృందం పనిచేసేలా చూడాలి. ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో రాజకీయ నాయకుల హడావిడి తగ్గితే మంచిది. అయితే మన వ్యవస్థలో ఉన్న లోపం నాయకుల ప్రచార పటాటోపం. అధికారులకు మంచి పేరు రావడాన్ని నాయకులు సహించలేరు. తమను మించి అధికారం చెలాయించడాన్ని ఒప్పుకోరు. ప్రజలకు, అధికారులకు మధ్య తాము కచ్చితంగా అనుసంధానంగా ఉండాల్సిందేననుకుంటారు. అందుకే అధికారులు సైతం పూర్తి స్థాయి చిత్తశుద్ధి కనబరచరు. మే నెల అత్యంత కీలకమని వైద్య రంగ నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే ఇరుగు పొరుగు రాష్ట్రాల మధ్య, కేంద్రానికి, రాష్ట్రాలకు మధ్య అనుమానాలు తలెత్తుతున్నాయి. స్పర్థలు పెరుగుతున్నాయి. ఇవి విషమించకముందే యుద్ధప్రాతిపదికన పనిచేసే తటస్థ యంత్రాంగాన్ని సిద్ధం చేసి రాజకీయ నాయకత్వాలు తమ పాత్రను కుదించుకుంటే మేలు.

## జగన్ దారిలోకి తెచ్చే పనిలో కమలం

గుంటూరు, ఏప్రిల్ 30, (న్యూస్ పల్స్) ఏపీలో ఎదగాలన్నది బీజేపీ ఆశ. ఆలోచన. దానికి ఎప్పటి నుంచో పావులు కదుపుతూ వస్తోంది. దేశమంతా వాజ్ పేయికి జై కొట్టినా కూడా ఏపీ జనాలు ఉలకలేదు, పలకలేదు. ఇక మోడీ వేవ్ భయంకరంగా 2014 ఎన్నికల వేళ దేశంలో వీచింది. అయినా కూడా ఏపీ పొలాల్లో ఎక్కడా కమలం విత్తనాలు మొలవలేదు. ఇపుడు కాకపోతే మరెప్పుడు అన్న కసి అయితే బీజేపీలో నానాటికీ పెరిగిపోతోంది. అన్నీ ప్రయోగాలూ అయిపోయిన వేళ ఏపీలో కమల విలాపమే మిగిలింది.ఇక తిరుపతి ఫలితం విషయంలో బీజేపీ ఒక అంచనా వేసుకుంది. కనీసంగా లక్షన్నర ఓట్లు అయినా రావాలి అన్నది బీజేపీ ఆలోచన. అవి తగ్గి ఏ యాభై వేలకో పడిపోతే మాత్రం బీజేపీ చూస్తూ ఊరుకోదు అంటున్నారు. ఏపీని నయానో భయానో దారికి తెచ్చుకోవడానికే పక్కా ప్లాన్ తో ముందుకు దూకుతుంది అని అంటున్నారు. ఏపీలో జనాలు బీజేపీ వైపు మొగ్గు చూపకపోతే పోవచ్చు కానీ రాజకీయం మాత్రం తనకు అనుకూలంగానే ఉంటుందని బీజేపీ నమ్ముతోంది. రెండు బలమైన ప్రాంతీయ పార్టీల అధినేతల బలహీనతలే పెట్టుబడిగా బీజేపీ సరికొత్త రాజకీయానికి తెర తీసే అవకాశాలు కూడా కొట్టిపారేయలేము అంటున్నారు.ఇప్పటికే కేంద్రంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమికి బీటలు వారాయి. తాజాగా మరో పార్టీ కూడా బయటకు వచ్చేసింది. దాంతో 2024 ఎన్నికలు బీజేపీ కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. అందువల్ల జగన్ మీద బీజేపీ తీవ్ర వత్తిడి పెట్టే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. జగన్ ని కేంద్రంలోని కూటమిలో చేరాలని ఇక మీదట టార్చర్ పెట్టినా ఆశ్చర్యపోనవసరం లేదని కూడా అంటున్నారు. జగన్ తన రాజకీయ లాభనష్టాలను బేరీజు వేసుకుని నో చెబితే మాత్రం బీజేపీ విశ్వరూపమే చూడాల్సి ఉంటుందని కూడా ఢిల్లీ వార్తలు చెబుతున్న సమాచారం.తిరుపతి ఉప ఎన్నికల ఫలితాలు వచ్చిన తరువాత ఏపీ రాజకీయాల్లో సంచలనాలే నమోదు అవుతాయని అంటున్నారు. బీజేపీ ఏకాఎకిన టీడీపీతో పొత్తు కలిపేసి వారి పక్కన చేరుతుంది అన్నది ఇప్పట్లో జరిగేది కాదని అంటున్నారు. బీజేపీ ఫస్ట్ ప్రయారిటీ వైసీపీయే అంటున్నారు. జగన్ నే నయానో భయానో దారికి రప్పించుకోవాలన్నదే బీజేపీ అజెండా అని చెబుతున్నారు.జగన్ ఈ విషయంలో మొండిగా వ్యవహరించినా లేక బీజేపీకి దూరం పాటించినా కూడా ఏపీ రాజకీయాల్లో భారీ తేడాలు వస్తాయని కూడా అంచనా వేస్తున్నారు. బీజేపీతో కలసి అడుగులు వేయకపోతే కేంద్ర పెద్దలు ఇక మీదట చూస్తూ ఊరుకోరని, దానికి తగిన కాషాయ మంత్రాంగాన్ని రెడీ చేసి పెట్టారని ఢిల్లీ కబురు మోసుకొస్తున్న వర్తమానం. మొత్తానికి జగన్ కి ముందు నుయ్యి వెనక గొయ్యి అన్నట్లుగా బీజేపీ తో వ్యవహారం ఉండబోతోంది అన్నది ఒక విశ్లేషణ. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## అవంతికి అప్పన్నే దిక్కు

విశాఖపట్టణం, ఏప్రిల్ 30, అసలే ఆయనలో భక్తి పాలు చాలా ఎక్కువ. ఊసుకు వస్తే చాలు దేవాలయాల్లోనే ఉంటారు. ఇపుడు ఆ భక్తి కాస్తా మరింత పీక్స్ కి చేరింది అంటున్నారు. ఆయన ఎవరో కాదు విశాఖ జిల్లాకు చెందిన మంత్రి అవంతి శ్రీనివాసరావు. లోకల్ బాడీ ఎన్నికలు కాదు కానీ ప్రశాంతంగా ఉన్న అవంతిలో అశాంతిని నిండా పెంచాయని అంటున్నారు. జగన్ మాటే వేదంగా భావిస్తూ అవినీతికి దూరంగా ఉంటూ వస్తున్న అవంతి శ్రీనివాసరావుకి ఇప్పటిదాకా మంచి మార్కులే పడ్డాయి. వివాదాలకు దూరంగా ఉంటూ తన పనేంటో తానేంటో అన్నట్లుగా వ్యవహరించే అవంతికి తాజాగా జరిగిన లోకల్ బాడీ ఎన్నికల ఫలితాలు భారీ స్ట్రోక్ ఇచ్చేశాయి.తెలుగుదేశం పార్టీ కంచుకోటలో విజయపతాకను ఎగరేసిన అవంతి శ్రీనివాసరావుకి రెండేళ్ళు తిరగకుండానే భీమిలీ చుక్కలు చూపించింది. పంచాయతీ ఎన్నికల్లో కూడా సైకిల్ జోరు బాగానే ఉంటే మునిసిపల్ ఎన్నికల నాటికి అది స్పీడ్ అందుకుంది. ఏకంగా భీమిలీలో ఏడు వార్డుల్లో రెండే రెండు వైసీపీకి దక్కాయి అంటే అవంతి కి అదే పెద్ద మైనస్ పాయింట్ అయింది అంటున్నారు. ఇక జరిగింది పొరాపాటో మరోటో చెప్పుకోవడానికి కూడా లేకుండా కూతురు పోటీ చేసింది అంటున్నారు. సొంత కుమార్తె కోసం పార్టీకి గాలికి వదిలేసారు అన్నది ఇపుడు అవంతి శ్రీనివాసరావు మీద హైకమాండ్ కి చేరిన ఫిర్యాదు.లోకల్ బాడీ ఫలితాలలో అవంతి శ్రీనివాసరావు సత్తా చూపిస్తే కచ్చితంగా ఆయన అయిదేళ్ళ మంత్రే అన్న మాట కూడా ఉంది. ఎందుకంటే విశాఖ అర్బన్ జిల్లాలో ఆయనను మించిన నేత మరొకరు లేరు. సిటీలో నాలుగు సీట్లు టీడీపీ ఎమ్మెల్యేలే గెలవడం కూడా అవంతికి పొలిటికల్ గా కలసివచ్చింది. కానీ ఇపుడు భీమిలీతో ఓటమితో పాటు విశాఖ కార్పొరేషన్ లో బొటా బొటీ మెజారిటీ వైసీపీకి దక్కడం వెనక ఫెయిల్యూర్ లో మంత్రి వాటా కూడా ఉందని హై కమాండ్ అంటోంది. దాంతో ఇక మినిస్టర్ పోస్ట్ పోయినట్లే అన్న చర్చ అయితే వైసీపీలో ఉంది.అవంతి శ్రీనివాసరావుకి విపరీతమైన భక్తి. ఆయన నియోజకవర్గంలోనే సింహాచలం కూడా ఉంది. అవంతి తరచూ అప్పన్నను దర్శించుకుం టారు. లోకల్ బాడీ ఎన్నికల తరువాత ఆయన మరింత



ఎక్కువగా అప్పన్న సేవలో తరిస్తున్నారు. ఇది దేవాలయ అధికారులతో పాటు అందరికీ ఆశ్చర్యంగానే ఉంది. అయితే అవంతి తన రాజకీయ జీవితంలో ఎపుడు ఇబ్బందులు వచ్చినా కూడా అప్పన్నకు మొక్కులు చెల్లించి మరీ వాటి నుంచి బయటకు వస్తూంటారు. మరి ఈసారి వచ్చిన ఆపదకు అప్పన్న అడ్డుకట్ట వేస్తారా. అవంతి పోస్టింగ్ ఊస్టింగ్ కాకుండా కాపాడుతాడా అన్న చర్చ వైసీపీలో గట్టిగా సాగుతోంది. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## బెజవాడ టీడీపీలో పట్టింపులు...

విజయవాడ, ఏప్రిల్ 30, బెజవాడ రాజకీయాల్లో తనకంటూ.. ప్రత్యేకతను సంతరించుకున్న నాయకుడు.. మాజీ ఎమ్మెల్యే బొండా ఉమా సైలెంట్ అయిపోయారు. అదే సమయంలో ఏకైక ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కూడా మౌనం పాటిస్తున్నారు. మరి ఎందుకు ? ఇలా జరుగుతోంది? ఇటీవల జరిగిన స్థానిక, కార్పొరేషన్ ఎన్నికల్లో దూకుడుగా వ్యవహరించిన నాయకులు.. ఇప్పుడు పూర్తిగా మౌనం పాటిస్తున్నారు. స్థానిక ఎన్నికల సమయంలో విజయవాడలో వైసీపీ గెలిస్తే.. తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని బొండా ఉమా వ్యాఖ్యానించారు.అదే సమయంలో ఎంపీ కేశినేని నానిపై విరుచుకుపడ్డారు. ఇక, కార్పొరేషన్ ఎన్నికల కీలక సమయంలో ఎంపీ కేంద్రంగా సాగిన వివాదంలో బొండా ఉమా తీవ్రంగానే స్పందించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ఈ వివాదంలో వేలు పెట్టకపోయినా.. ఎన్నికల్లో మాత్రం ఆశించిన విధంగా స్పందించలేదనే టాక్ ఉంది. సరే! ఇప్పుడు ఎన్నికలు ముగిశాయి. కానీ.. నేతలు మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. పార్టీ తరఫున వాయిస్ వినిపించేవారు కూడా తెరమరుగు కావడంతో పార్టీలో నిస్తేజ పూరిత వాతావరణం ఏర్పడింది.మరోవైపు.. టీడీపీ పూర్తిగా భూస్థాపితం అయిపోయిందనే వ్యాఖ్యలు వైసీపీ వర్గాలు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. వైసీపీ సోషల్ మీడియాలో టీడీపీపై పెద్ద ఎత్తున వ్యతిరేక కామెంట్లు ప్రచారం జరుగుతున్నా యి. అయినప్పటికీ.. ఫైర్ బ్రాండ్ నాయకుడుగా పేరుతెచ్చుకున్న బొండా ఉమా కానీ, గద్దె రామ్మోహన్ కానీ.. ఎవరూ స్పందించడం లేదు. ఏ ఒక్కరూ వీటిపై కామెంట్లు చేయడం లేదు. దీంతో పార్టీలో కార్యకర్తల మధ్య కూడా ఈ విషయం చర్చనీయాంశంగా మారింది. అయితే.. దీనివెనుక పార్టీ అధినేత చంద్రబాబు కారణమని బొండా ఉమ వర్గాలు చెబుతున్నాయి.ఎంపీ కేశినేనినానితో కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఏర్పడిన వివాదం.. సవాళ్లు ప్రతిసవాళ్ల విషయాన్ని చంద్రబాబు పట్టించుకోలేదని.. ఎంపీవైపే ఉన్నారని.. బొండా ఉమ వర్గాలు పేర్కొంటున్నాయి. పైగా.. ఎక్కడా బొండాను సర్దుబాటు చేసే ప్రయత్నం కూడా చేయలేదని, కేవలం ఎంపీ నాని వైపే చంద్రబాబు నిలబడ్డారని.. బొండా అనుచరులు చెబుతున్నారు. దీంతో బొండా ఉమా.. అసలు నగరంలోనే లేరని అంటున్నారు.ఇంత వరకు బాగానే మరి గద్దె రామ్మోహన్ మౌనం వెనుక ఏం జరిగింది? ఆయనెందుకు మౌనంగా ఉన్నారు? అనేది మాత్రం తెలియాల్సి ఉంది. కార్పొరేషన్ ఎన్నికలకు ముందు మేయర్ పీఠాన్ని ఆశించినా.. దక్కలేదు. ఈ కారణంగానే ఆయన మౌనంగా ఉన్నారా? అలా అయితే.. అసలు పార్టీనే ఓడిపోయిన నేపథ్యంలో ఇప్పుడు ఇంకా అవే పంతాలు ఎందుకు? అనే ప్రశ్న తెరమీదికి వస్తోంది. ఏదేమైనా.. పంతాలు.. పట్టింపులతో పార్టీని నాశనం చేస్తున్నారనే వాదన వస్తుండడం గమనార్హం.

### వైయస్సార్ బీమా సొమ్ము పంపిణీ

తుగ్గలి మండలం పరిధిలోని లక్ష్మి తాండ కు చెందిన రమావత్ లక్ష్మీదేవి అనే మహిళకు వైయస్సార్ బీమా కింద పదివేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సి.జి తాండ సర్పంచ్ లక్ష్మి,మాజీ జెడ్పీటీసీ సభ్యులు నారాయణ నాయక్,వైకాపా జెడ్పిటిసి అభ్యర్థి పులికొండ నాయక్ లు గురువారం అందజేశారు. ఈనెల 25వ తేదీన లక్ష్మి తండాకు చెందిన రమావత్ వెంకటేష్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు.మృతునికి వైఎస్సార్ బీమా పథకం వర్తించడంతో భార్య రమావత్ లక్ష్మీదేవికి తక్షణ ఆర్థిక సహాయం కింద పదివేల రూపాయలు మంజూరు అయ్యాయి.వెల్ఫేర్ సెక్రెటరీ తేజ,భీమా మిత్ర షకీలా నగదును వారికి అందించారు.ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నారాయణ నాయక్ , వైకాపా జెడ్పిటిసి అభ్యర్థి పులికొండ నాయక్ లు మాట్లాడుతూ కుటుంబములో యజమాని చనిపోతే ఆ కుటుంబాన్ని ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రెండు లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారని,తక్షణ సహాయం కోసం పదివేల రూపాయలను అందివ్వడం జరిగిందన్నారు.నెల రోజులలొలక్షతొంబైవేలరూపాయలువస్తాయని తెలిపారు.

## ఆపరేషన్ ఆకర్ష్....

విశాఖపట్టణం, ఏప్రిల్ 30, (న్యూస్ పల్స్) ఏపీలో మళ్లీ రాజకీయ కప్పగెంతులకు టైమ్ వచ్చేసినట్లుగా ఉంది. ఢీ అంటే ఢీ కొడుతున్న టీడీపీని చాలా వరకూ ఎన్నికలలో ఓడించడం ద్వారా దెబ్బతీసిన వైసీపీ ఇపుడు ఓడి వాడిన పసుపు శిబిరం పస తేల్చే పనిలో పడిందంటున్నారు. ఏపీలో రాజకీయంగా బలంగా వైసీపీ ఉంది. మరో మూడేళ్ల వరకూ అధికారానికి ఎలాంటి ఢోకా లేదు. ఈ సంగతి చంద్రబాబు కావాలని విస్మరించినా తమ్ముళ్లకు తెలియనిది కాదు. సరిగ్గా ఈ పాయింట్ నే ఆసరాగా చేసుకుని టీడీపీకి గట్టి షాక్ ఇవ్వడానికి వైసీపీ రెడీ అయిపోయింది.టీడీపీ ఓడినా బలమైన నేతలు ఇంకా ఆ పార్టీఎని పట్టుకుని ఉన్నారు. వారు ఇప్పటిదాకా అనుకున్నది వేరు జరుగుతున్నది వేరు అన్నట్లుగా పొలిటికల్ సీన్ ఉంది. రాజకీయాలల్లో ఒక పార్టీ గెలిస్తే మరో పార్టీ ఓడడం కామన్. మరో ఎన్నికలో టీడీపీ వస్తుంది అన్న నమ్మకం అయితే నిన్నటిదాకా ఉండేది, ఇటు సొంత టీడీపీలో చూస్తే చంద్రబాబు పోరాట పటిమ మీద డౌట్లు వచ్చేస్తున్నాయి. భావి నేతగా లోకేష్ ఎదగలేకపోతున్నారు. ఈ మథనమే ఇపుడు వారిని పక్క చూపులు చూడాల్సిన పరిస్థితిని కల్పిస్తోందని అంటున్నారు.ఈ నేపథ్యం రాజకీయంగా తమకు కలసివస్తుందని వైసీపీ నాయకత్వం అభిప్రాయపడుతోంది. దీంతో వైసీపీ నుంచి కొందరు కీలకమైన నేతలను బరిలోకి దింపి మరీ ఆపరేషన్ ఆకర్ష్ కి తెర తీస్తున్నారు అని ప్రచారంలో ఉంది. ఉత్తరాంధ్ర విషయానికి వస్తే సీనియర్ మంత్రిగా ఉన్న బొత్స సత్యనారాయణ శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలలోని టీడీపీ నేతలకు గేలం వేస్తున్నారు అంటున్నారు. ఆయన ఏకంగా ఏపీ టీడీపీ మాజీ ప్రెసిడెంట్ కళా వెంకటరావుని పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని టాక్ నడుస్తోంది. కళా ఫ్యామిలీ చాలా పెద్దది, పైగా రెండు జిల్లాలలో కలుపుకుని మూడు నాలుగు అసెంబ్లీ సీట్లలో వారి ప్రభావం ఉంది. దాంతో పాటు సొంత సామాజికవర్గం కూడా కావడంతో కళాను బొత్స వైసీపీలోకి తీసుకురావాలనుకుంటున్నారుట.విశాఖను వైసీపీకి కంచుకోటగా మార్చే పనిలో విజయసాయిరెడ్డి బిజీగా ఉన్నారని అంటున్నారు. ఆయన గేలానికి ఒక టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్సీ ఇప్పటికే చిక్కారని ప్రచారం సాగుతోంది. ఆయన గత కొంతకాలంగా టీడీపీ అధినాయకత్వం పోడకల పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు అంటున్నారు. ఆయనతో పాటు మరికొంతమంది మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతల మీద కూడా సాయిరెడ్డి గురి పెట్టారని అంటున్నారు. వీరంతా వస్తే కనుక విశాఖ జిల్లాలో టీడీపీ కి అతి పెద్ద బ్రేకులు పడిపోతాయని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో?

## నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం... సర్పంచ్ ఎల్లిబాయి

తుగ్గలి మండల పరిధిలోని రోల్లపాడుతాండ లో నీటి ఎద్దడి నివారణకు పత్తికొండ ఎమ్మెల్యే శ్రీదేవి సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు వై.జి తాండ సర్పంచ్ ఎల్లిభాయి,వైఎస్ఆర్సీపీ నాయకుడు బాబు నాయక్ తెలిపారు.గురువారం రోల్లపాడుతాండ గ్రామంలో మంచినీటి బోరుబావి ను ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్యను ఎమ్మెల్యే శ్రీదేవి దృష్టికి తీసుకువెళ్లాగా ఆమె స్పందించి తక్షణమే గ్రామంలో బోర్ వేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు వారు తెలిపారు. దీంతో సంబంధిత అధికారులు గ్రామానికి చేరుకుని బోర్ వేయగా గ్రామ ప్రజలకు సరిపడే నీరు వస్తాయని బోరుబండి నిర్వాహకులు తెలిపారు.త్వరలోనే బోరుకు విద్యుత్ మోటార్ వేసి,పైప్ లైన్ ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు. గ్రామంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందని వారు తెలిపారు. గ్రామంలో ఏర్పడిన నీటిసమస్యను పరిష్కరించినందుకు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే శ్రీదేవికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు చిన్న కృష్ణ నాయక్,బాలు నాయక్,అశోక్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ సౌత్ పై భరత్ కన్ను

విశాఖపట్టణం, ఏప్రిల్ 30, (విశాఖలో టీడీపీకి ఇపుడు నాలుగు దిక్కులూ రెండు అయ్యాయి. విశాఖ ఉత్తరం నుంచి ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు ఉన్నా లేనట్లే అయ్యారు. ఇక సౌత్ నుంచి గెలిచిన వాసుపల్లి గణేష్ కుమార్ వైసీపీలోకి జంప్ చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీలో ఆశావహులు ఈ రెండు సీట్ల మీద దృష్టి సారించారు. గత ఎన్నికల్లో విశాఖ ఎంపీగా పోటీ చేసిన బాలయ్య అల్లుడు, దివంగత ఎంవీవీఎస్ మూర్తి మనవడు అయిన శ్రీభరత్ దక్షిణం వైపు చూస్తున్నట్లుగా ప్రచారం జోరుగా సాగుతోంది.విశాఖ ఎంపీగా 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీ చేసిన శ్రీ భరత్ ఏడు నియోజకవర్గాల్లోనూ ప్రచారం చేశారు. మరి పార్టీ యోగక్షేమాలు మొత్తం అన్ని చోట్లా చూడాల్సిన బాధ్యత ఆయన మీద ఉంది. అందునా పార్టీ విపక్షంలో ఉన్న వేళ శ్రీభరత్ అయితే కచ్చితంగా అండగా ఉండాలి. కానీ ఆయన విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో కేవలం సౌత్ కి మాత్రమే పరిమితం అయ్యారు. దాంతో ఆయన ఇక్కడ నుంచి పోటీ చేస్తారు అన్న చర్చ అయితే బయల్దేరింది.దక్షిణ నియోజకవర్గంలో సీన్ చూస్తే టీడీపీకి గట్టి నాయకులు ఎవరూ లేరు. మాజీ ఎమ్మెల్యే ఎస్ ఎ రహమాన్ వైసీపీలో ఎపుడో చేరిపోయారు. ఇక వాసుపల్లి కూడా అటే జంప్ చేశారు. దాంతో వచ్చే ఎన్నికల వేళ పోటీకి నేతలను వెతకాల్సిందే అంటున్నారు. దాంతో తానే ఎందుకు పోటీ చేయకూడదు అన్న ఆలోచన శ్రీభరత్ కి వచ్చిందా. లేక తమ్ముళ్ళే కోరారా అన్నది తెలియదు కానీ ఆయన మాత్రం సౌత్ మీద ప్రేమను పెంచుకుంటున్నారు అంటున్నారు. దాంతో ఆయన తన కార్యాచరణను అక్కడ నుంచే ప్రారంభించారని చెబుతున్నారు.ఇక విశాఖ దక్షిణం పూర్వం విశాఖ వన్ గా ఉండేది. రెండు దశాబ్దాల క్రితం విశాఖ వన్ నుంచి పోటీకి తన కోడలిని రంగంలోకి దింపాలని మూర్తి మాస్టర్ ప్లాన్ వేసినట్లుగా అప్పట్లో ప్రచారం అయితే జరిగింది. ఆమె ఎవరో కాదు శ్రీభరత్ తల్లి. అంతే కాదు కేంద్ర మాజీ మంత్రి కావూరి సాంబశివరావు కుమార్తె కూడా. అలా ఆమె రాజకీయ నేపథ్యాన్ని ఉపయోగించుకోవాలని మూర్తి ఆలోచించారని చెబుతారు. అయితే చంద్రబాబు మాత్రం మూర్తి మాటను పడనీయలేదు అంటారు. మళ్ళీ ఇన్నాళ్ళకు మూర్తి మనవడు శ్రీభరత్ ఈ సీటు మీద మక్కువ పెంచుకున్నారు అంటే తమ్ముళ్ళకు ఇపుడు ఆ గతం గుర్తుకు వస్తోందిట. ఏది ఏమైనా ఈసారి అయినా చంద్రబాబు పడనిస్తారా, భరత్ కి సౌత్ ఎమ్మెల్యే టికెట్ ఇస్తారా అన్నదే ఇపుడు చర్చ.

## మే 2న కౌంటింగ్ ప్రశాంత వాతావరణం లో జరగాలి

సిబ్బంది, ఏజెంట్లకు మొబైల్ ఫోన్లు అనుమతి లేదు
డిపాజిట్ కౌంటర్లు వుండవు
సిబ్బంది, ఏజెంట్లు ఐ. డి. తో పాటు కోవిడ్ నెగటివ్ రిపోర్టు వుంటేనే అనుమతి
కౌంటింగ్ కోసం 50 శాతం అదనపు సిబ్బంది అందుబాటులో వుండాలి
జిల్లా కలెక్టర్

తిరుపతి, ఏప్రిల్ 29 మే 2న తిరుపతి పార్లమెంట్ ఉప ఎన్నిక కు సంబంధించిన తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు సెగ్మెంట్ల కౌంటింగ్ ఎస్. వి. ఆర్ట్స్ కళాశాలలో జరగనున్న నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని, సంబంధిత ఎ. ఆర్. ఓ. లకు జిల్లా కలెక్టర్ ఎం. హరినారాయణన్ సూచించారు. గురువారం ఉదయం స్థానిక ఆర్. డి. ఓ. కార్యాలయం లో మే 2న జరగనున్న కౌంటింగ్ పై ఎ. ఆర్. ఓ. లతో నగర పాలక కమిషనర్ గిరీషా తో కలసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మే 2న కౌంటింగ్ ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభించాలని, అందుకు కావలసిన అన్ని ఫారాలు సిద్దంగా వుండాలని సూచించారు. ఎన్నికల కమిషన్ నిన్న ఇచ్చిన కోవిడ్ సర్క్యులర్ మేరకు కౌంటింగ్ లో పాల్గొనే సిబ్బంది, ఏజెంట్లు అందరూ కోవిడ్ టెస్టు చేసుకోవాలి, ఏ. ఆర్. ఓ. సమన్వయంతో టెస్టులు పూర్తి చేయాలి అన్నారు. కౌంటింగ్ రోజు ఐ. డి. కార్డు తో పాటు, కోవిడ్ నెగటివ్ రిపోర్టు వుండాలని, అప్పుడే అనుమతి వుంటుందని, అందుకే 50 శాతం సిబ్బంది అదనంగా సమకూర్చుకోవాలని సూచించారు. అభ్యర్థులు ఏజెంట్ల విషయం లో ఇప్పటికే ఇ. సి. సర్క్యులర్ అందజేసి వుందని తెలిపారు. కౌంటింగ్ హాళ్ళు శానిటేషన్ చేయాలి అన్నారు. కౌంటింగ్ హాళ్ళు లో ఎగ్జాస్ట్ ఫాన్లు ఎర్పాటు చేయాలి అన్నారు. కౌంటింగ్ ప్రక్రియ వీడియోగ్రఫీ చేయాలని తెలిపారు. కౌంటింగ్ సమయం లో మాస్కులు, ఫేస్ షీల్డ్ వాడాలని, ఏజెంట్ల విషయం లో ఒకరు మార్చి ఒకరు పి. పి. ఇ ధరించాల్సి వుంటుందని సూచించారు. పోలీసు సిబ్బంది ఫేస్ షీల్డ్ , మాస్కులు తప్పనిసరి అన్నారు.

## ధాన్యం గిట్టుబాటు ధర లేక ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతులు

రాజమండ్రి : తూర్పుగోదావరి జిల్లాలో ప్రస్తుతం దాదాపుగా నాలుగు లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. ప్రస్తుతం పంటకు కోతలు 45% శాతం పూర్తి కావస్తున్నాయి. బస్తాలు లో ధాన్యం నింపుకొని సిద్ధంగా ఉన్న ధాన్యాన్ని కొనే నాథుడే లేకుండా పోయాడు. అయ్యా మేము పండించిన ధాన్యాని కొనడానికి రండి బాబు అని అధికారులను , దళారుల వేడుకుంటున్నా ఫలితం ఏమాత్రం లేదు. పంట చేతికి వస్తున్న సమయంలో భారీ వర్షాలు పడడంతో సుమారు ఎకరానికి 10 బస్తాల ధాన్యం నష్టం వాటిల్లింది. ఎట్టకేలకు అష్టకష్టాలు పడి పండించిన రైతులు ధాన్యాన్ని కొనే నాథుడే లేడు అని రైతులు వాపోతున్నారు. తాళ్లరేవు మండలం లో కొంతమంది రైతులు మాట్లాడుతూ అయ్యా మేము ఎకరానికి 25,000 నుండి 30,000 వరకు పెట్టుబడి పెడుతున్నాం. ప్రభుత్వం 75 కేజీల బస్తా ధాన్యాన్ని 1400 వందల రూపాయల కి కొనమని రైతు భరోసా కేంద్రాలు కి చెబుతుంది.. కానీ మా దగ్గర దళారులు వెయ్యి రూపాయలు లేదా 1100 రూపాయలు కి కొంటున్నారు. కనీసం ఆ ధర కు అయిన కొనండి అని చెప్పేసి అధికారులను దళారులు వేడుకుంటున్నాను ఫలితం లేదు. ఇలా అయితే మేము ఏ మందు తాగి చనిపోవాలి మా రైతుల పరిస్థితి ఏంటి అని రైతులు వాపోతున్నారు. దయచేసి ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ప్రకటించి దాన్యం కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాను అని రైతులు అంటున్నారు

## వివాదస్పదమవుతున్న ఎస్సై చితకబాదుడు

విజయనగరం : ఎస్సై రమణ దళితులుపై విరుచుకుపడిన వైనం వివాదంగా మారంది. ఎస్సై పై చర్య తీసుకోవాలని ఎస్సీ కాలనీ వాసులు సాలూరు సర్కిల్ ఆఫీస్ ను ముట్టడించిన స్టేషన్ వద్ద బైఠాయించారు. భార్యాభర్తల గొడవల నేపథ్యంలో డోల రాజు అనే వ్యక్తిని పాచిపెంట ఎస్సై రమణ చితకకొట్టాడు. అడ్డు వచ్చిన తల్లిమేరమ్మనికూడా దూషించి గాయపరిచారని వారు ఆరోపించారు. తక్షణమే ఎస్సై రమణను సస్పెండ్ చేయాలని దళితులు డిమాండ్ చేసారు. గతంలోకుడా పలువురిపైపాచిపెంట ఎస్సై రమణ దూకుడు గా వ్యవహరించారని వారు అన్నారు. గతంలో ఎస్సై వ్యవహారశైలిని వ్యతిరేకించి నడి రోడ్డుపై ఎస్సై ని ఇద్దరు వ్యక్తులు చితకొట్టారని వారు అన్నారు. జర్నలిస్టులపై సైతం చేయచేసుకుని బెదిరించిన సందర్భాలు అనేకమంటూ ఎస్సై పై ఆరోపణలు గుప్పించారు

## ప్రజలు జాగ్రత్తగా వుండాలి

విజయవాడ ప్రజలందరూ జాగ్రత్తగా ఉండండని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి విజ్ఞప్తి చేసారు. విజయవాడ నగర పాలక సంస్థ సర్కిల్ వన్ కార్యాలయం నుంచి మిల్క్ ప్రాజెక్టు వరకు ప్రజలకు కరోనా వైరస్ నియంత్రణపై ప్రజల్లో చైతన్యపరిచే విధంగా అవగాహన ర్యాలీ కార్యక్రమాన్ని నగర మేయర్ శుక్రవారం ప్రారంభించారు. నగరపాలక సంస్థ సర్కిల్ వన్ కార్యాలయంలో విధులు నిర్వహించే పారిశుద్ధ్య కార్మికులకు శానిటైజర్ లు, మాస్కులు, గ్లౌజులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ దేశంలోనూ, రాష్ట్రంలోనూ కరోనా వైరస్ సెకండ్ స్టేజిలో ఉన్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు ప్రజలు అందరూ కచ్చితంగా మాస్కులు, శానిటైజర్ లు, భౌతిక దూరం పాటిస్తే కరోనా వైరస్ నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చు అని చెప్పారు. అత్యవసరమైతే గాని ఇల్లువదిలి బయటకు రావొద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పరీక్షలు నిర్వహించడం దారుణం

మచిలీపట్నం రాష్ట్రంలో ప్రతి రోజు వేల సంఖ్యలో కరోనా పాజిటివ్ నమోదవుతుండగా, పదుల సంఖ్యలో మరణాలు జరుగు తున్నాయని,ఇలాంటి పరిస్థితుల్లో పదవ తరగతి పరీక్షలు నిర్వహిం చాలని ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం తీసుకోవడం దారుణమని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.కృష్ణా జిల్లా మచిలీపట్నంలో మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నిర్ణయం వాళ్ల విద్యార్థులు కరోనాకి బలైపోయే ప్రమాదం ఉందని,10వ తరగతి, ఇంటర్ పరీక్షల పేరుతో విద్యార్థుల జీవితాలకు విషమ పరీక్ష పెడుతున్నారని, దాదాపు 15 లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉందని ప్రభుత్వం కనుక పరీక్షలు నిర్వహిస్తే విద్యార్థుల వెంట వారి కుటుంబ సభ్యులు కూడా బయటకు వస్తారని పరీక్షల నిర్వహణ కోసం వేలాదిమంది ఉపాధ్యాయులు కూడా బయటకు రావాల్సి ఉంటుందని చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం పారిశుద్ధ్య కార్మికులపై అదనపు భారం పడుతుందని విద్యార్థులు వారి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు వారి కుటుంబ సభ్యులు కూడా కరోనా కాటుకి బలైపోయి ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# తమ్ముళ్లలో రాని జోష్

నెల్లూరు, ఏప్రిల్ 30, (న్యూస్ పల్స్) తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు ఇప్పటికైనా పార్టీపైనే దృష్టి పెట్టాల్సి ఉంటుంది. లేకుంటే మరీ బలహీనంగా మారే అవకాశాలు కన్పిస్తున్నాయి. తొలుత ప్రజల కన్నా పార్టీ నేతల్లో విశ్వాసం కల్గించే చర్యలను చంద్రబాబు చేపట్టాల్సి ఉంటుంది. ఇప్పటికే తెలుగుదేశం పార్టీ నాయకత్వంపై నమ్మకం లేకుండా పోయింది. నేతలు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. క్రమశిక్షణ పార్టీగా చెప్పుకునే తెలుగుదేశం పార్టీలో అదే లోపం ఇప్పుడు పార్టీకి ఇబ్బందికరంగా మారింది. చంద్రబాబు నాయుడు 2019 ఎన్నికల్లో ఓటమి పాలయిన తర్వాత పార్టీపైనే దృష్టి పెట్టారు. ఇటు ప్రజలలోకి వెళుతూ పార్టీలో జోష్ ను నింపాలని ప్రయత్నించారు. అనేక సమస్యలపై చంద్రబాబు ఆందోళనలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు నేతలనుంచి సహకారం కొరవడటాన్ని చంద్రబాబు గుర్తించారు. దీంతో పార్టీని పటిష్టం చేయాలనుకుని రాష్ట్ర స్థాయి కమిటీని నియమించారు. పార్లమెంటరీ నియోజకవర్గాల వారీగా ఇన్ ఛార్జులను నియమించారు.కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ పూర్తిగా పడకేసింది. లోకేష్ నాయకత్వాన్ని కూడా నేతలు అంగీకరించే పరిస్థితి లేదు. ఈ సమయంలో చంద్రబాబు పార్టీ బలోపేతంపైనే దృష్టి పెట్టాలంటున్నారు. ఎన్నికల పూర్తయిన తర్వాత చంద్రబాబు జిల్లాల వారీగా సమీక్షలు నిర్వహించారు. అన్ని జిల్లాల సమీక్షలను నిర్వహించలేదు. కరోనా కారణంగా సమీక్షలు వాయిదా పడ్డాయి. చంద్రబాబు తమ్ముళ్లపై పెట్టుకున్న ఆశలు నీరుగారి పోయాయి. దీంతో మరోసారి చంద్రబాబు జిల్లాల పర్యటనలు చేయాలని నిర్ణయించారు. నేరుగా జిల్లాలకే వెళ్లి ముఖ్య నేతలతో పాటు ద్వితీయ శ్రేణి నేతలతో నేరుగా మాట్లాడాలని నిర్ణయించారు. తిరుపతి ఉప ఎన్నికల ఫలితాల తర్వాత జిల్లాల టూర్ ప్లాన్ చేయాలని చంద్రబాబు సీనియర్ నేతలకు సూచించినట్లు తెలిసింది. తొలుత పార్టీలో ఐక్యత తీసుకుని వచ్చి, నేతల్లో నమ్మకం కల్గించడమే ఇప్పుడు చంద్రబాబు ముందున్న లక్ష్యం.

# ఏర్పేడు సమీపంలో 15 ఎర్రచందనం దుంగలు స్వాధీనం స్మగ్లర్ అరెస్ట్

తిరుపతి ఏర్పేడు సమీపంలోని కృష్ణా పురం సమీపంలోని అడవుల నుంచి మోసుకుని వస్తున్న 15 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకోవడం తో పాటు, తమిళ నాడుకు చెందిన ఒక స్మగ్లర్ ను టాస్క్ ఫోర్స్ అరెస్ట్ చేసింది. అనంతపురం రేంజి డిఐజి క్రాంతి రాణా టాటా ఆదేశాల మేరకు డీఎస్పీ లు గిరిధర్, మురళీధర్ నేతృత్వంలో ఆర్ ఐ భాస్కర్ టీమ్ లోని లింగాధర్ బృందం గురువారం రాత్రి నుంచి ఏర్పేడు సమీపంలోని కృష్ణాపురం అడవుల్లో కూంబింగ్ చేపట్టారు. శుక్రవారం తెల్లవారుజామున దాదాపు 15 మంది స్మగ్లర్లు కృష్ణాపురం బీట్ వద్ద ఎర్రచందనం దుంగలు మోసుకుని వస్తూ కనిపించారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, వారు దుంగలు పడవేసి, చీకట్లో పారిపోయారు. అయితే టాస్క్ ఫోర్స్ పోలీసులు ఒక స్మగ్లర్ ను పట్టుకో గలిగి నట్లు అక్కడకు చేరుకున్న డీఎస్పీ మురళీధర్ తెలిపారు. స్మగ్లర్ ను విచారిస్తున్నామని, ఇతనిని తమిళనాడు తిరువన్నామలై జిల్లా జమునామత్తూరుసమీపంలోనిజవ్వాది మలై కు చెందిన జయశంకర్ (43)గా గుర్తించినట్లు తెలిపారు. ఇతనితో పాటు వచ్చిన వారి కోసం గాలుస్తున్నట్లుతెలుపారు. ఈస్మగ్లర్ నుంచి మరింత సమాచారం రాబడుతున్నట్లు తెలిపారు. టాస్క్ ఫోర్స్ బృందాలు శేషాచలం లోని అన్ని కొండ ప్రాంతాలను జల్లెడ పడుతున్నామని చెప్పారు. సంఘటన స్థలానికి డీఎస్పీ మురళీధర్ తో పాటు ఆర్ ఐ భాస్కర్, ఎఫ్ ఆర్ ఓ ప్రసాద్ చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. దీనిపై టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పాత్రికేయులకు వైద్య సేవల అనుసంధానానికి నోడల్ ఆఫీసర్లు సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి

అమరావతి ఏప్రిల్ 30 ప్రస్తుతం కరోనా సెకండ్ వేవ్ విస్తృతంగా వ్యాపిస్తున్న నేపథ్యంలో కరోనా మహమ్మారి బారినపడి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాత్రికేయులకు వైద్య సేవలు అందించటంలో జిల్లా వైద్య యంత్రాంగానికి, పాత్రికేయులకు మధ్య అనుసంధాన కర్తలుగా పనిచేసేందుకు సమాచార శాఖ రాష్ట్ర స్థాయిలో ఒక సీనియర్ అధికారిని, జిల్లా స్థాయిలో శాఖాధిపతులను నోడల్ అధికారులుగా నియమించినట్లు సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, కోవిడ్-19 రాష్ట్ర స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సభ్యులు శ్రీ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నోడల్ అధికారులు సంబంధిత జిల్లాలలో గుర్తించిన ఆసుపత్రిలో పాత్రికేయులకు వైద్య పరీక్షల నిర్వహణ నుంచి వైద్యం అందించటం, కోవిడ్ ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకునే వరకు సహాయకారిగా ఉంటూ అన్ని అవసరమైన వైద్య చర్యలను తీసుకోవలసిందిగా వారిని ఆదేశించారు. పాత్రికేయులకు వైద్యం అందించేందుకు రాష్ట్ర స్థాయిలో నోడల్ అధికారిగా సమాచార, పౌరసంబంధాల శాఖ సంయుక్త సంచాలకులు పోతుల కిరణ్ కుమార్ (మొబైల్ నెం: 9121215223) ను నియమించామని, అదేవిధంగా ప్రతి జిల్లాలో సమాచార శాఖ (ఉపసంచాలకులు/సహాయ సంచాలకులు), సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లను పాత్రికేయులకు అందుబాటులో ఉంచి ఎల్ల వేళలా వారికి సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పాత్రికేయులు విధినిర్వహణలో భాగంగా అనేక ప్రాంతాలకు వెళ్లవలసి రావటం అలాంటి సందర్భంలో మాస్క్, శానిటైజర్ లు వాడుతూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాత్రికేయుల విధినిర్వహణను దృష్టిలో ఉంచుకొని వారికి వ్యాధి నిరోధక టీకా (వ్యాక్సిన్) ను వేయించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి తగు చర్యలను తీసుకోవాల్సిందిగా నోడల్ అధికారులకు సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కోవిడ్-19 బారినపడిన పాత్రికేయులకు ప్రత్యేకంగా ఆసుపత్రులలో బెడ్లు కేటాయించాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఆంధ్రప్రదేశ్ లో వైద్య, ఒక పక్క వైద్యులు కరోనా నియంత్రణకు ముందు వరుసలో నిలబడి వైద్యం అందిస్తున్నారని వారికి మీడియా కూడా సహకారం అందించాలన్నారు. కోవిడ్ బారిన పడి చనిపోయిన పాత్రికేయులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 5 లక్షలు సాయం అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఫారం మరియు అన్ని వివరాలతో కూడిన డాక్యుమెంట్లను జిల్లాలోని సమాచార, పౌరసంబంధాల శాఖ అధికారులకు అందజేయాల్సిందిగా కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి తెలియజేశారు.

# కౌంటింగ్ సిబ్బందికి కోవిడ్ పరీక్ష తప్పనిసరి

కమిషనర్ దినేష్ కుమార్

నెల్లూరు కోవిడ్ నివారణా చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికల కౌంటింగ్ కు హాజరయ్యే సిబ్బందికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నామని, విధులకు హాజరయ్యే సిబ్బంది కోవిడ్ నెగటివ్ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా సమర్పించాలని ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి, నగర పాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికల కౌంటింగ్ విధులకు హాజరయ్యే సిబ్బందికి కోవిడ్ నిర్ధారణ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డికె మహిళా కళాశాల కౌంటింగ్ కేంద్రంలో కోవిడ్ నివారణకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నామని, బ్లీచింగ్ తో పాటు శానిటైజేషన్ ప్రక్రియను పటిష్టంగా నిర్వహిస్తున్నామని కమిషనర్ తెలిపారు.

# 2వ డివిజన్లో కరోనా నియంత్రణ సేవలు చేపట్టిన డివిజన్ ఇంచార్జి

నెల్లూరు నెల్లూరు గ్రామీణ నియోజవర్గ పరిధిలోని 2వ డివిజన్ పరిధిలోని గుడిపల్లి పాడు అరుంధతి వాడలో స్థానిక డివిజన్ ఇంచార్జి పడిగినేటి రామ్మోహన్ కరోనా నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మరియు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇంచార్జి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలియజేశారు. కరోనా మహమ్మారి విస్తరిస్తున్న వేళ ప్రతి ఒక్కరు సామజిక దూరం పాటిస్తూ,మాస్క్ ధరించాలని అవగాహనా కల్పిస్తూ ,4వ రోజు 2 వ డివిజన్ గుడిపల్లిపాడు అరుంధతివాడ లో శానిటేషన్ సిబ్బంది సురేంద్రనాథ్, పి.హరీష్, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఓ. అనితతో కలిసి శానిటేషన్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా అరుంధతీయ వాడా ప్రాంతంలోని వీధి వీధి కి తిరుగుతూ గడపగడపకు బ్లీచింగ్ చల్లించారు.

# వైభవంగా ముత్యాలమ్మ జాతర

శ్రీకాళహస్తి శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం అందమైన ఆలయం ముత్యాలమ్మ వీధిలో వెలసివున్న ముత్యాలమ్మ ఆలయం లో మూడు రోజులపాటు ముత్యాలమ్మ జాతర వేడుకలు దేవస్థానము ఏకాంతంగా నిర్వహించారు జాతక ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం అమ్మవారి ముత్యాలమ్మ ఉత్సవమూర్తిని సుందరంగా రకాల పుష్పాలతో ఆభరణాల తో చక్కగా అలంకరించి కర్పూర హారతులు సమర్పించి ఆలయ చుట్టూ మంగళవాయిద్యాలతో మేళతాళాలతో మూడు ప్రదక్షిణలు ఊరేగింపుగా చేశారు అనంతరం ధూపం నైవేద్యం అఖండ దీపారాధన కుంభహారతి దీప కాంతులతో అమ్మవారికి మంగళ హారతులు సమర్పించారు విశేషంగా భక్తులు తరలివచ్చి ఆ ముత్యాలమ్మ అమ్మవారిని మనసారా చూసి దర్శించి కృపాకటాక్షాలు పొందారు ముత్యాలమ్మ జాతర ఉత్సవాలు గురువారం సాయంత్రం తో ముగిసాయి ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాలలో ఇంటి నిర్మాణాలను పరిశీలించిన గూడూరు ఎమ్మెల్యే

నెల్లూరు జిల్లా , గూడూరు 2వ పట్టణ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం వారుఇచ్చిన ఇళ్ల స్థలాల్లో ఇల్లు కట్టుకుంటున్న లబ్ధిదారులను కలిసి గూడూరు శాసన సభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్‌రావు ఇంటినిర్మాణాలనుపరిశీలించారు. ఈ సందర్భం గాఇల్లు కట్టుకుం టున్న లబ్ధిదారులు తాము ఇల్లు కట్టుకోవడానికి సరైన సదుపా యాలు లేక ఇబ్బందులు పడుతున్నామని తెలియజేశా రు. గృహ నిర్మాణంలో భాగంగాప్రధానం నీటి సమస్య మరియు కరెంట్ సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టి కి లబ్ధిదారులుతీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వరప్రసాదరావు సమస్యల పరిష్కా రానికి తగు చర్యలు తీసుకుంటామని , ప్రభుత్వ అధికారులతో మాట్లాడి ఇల్లు కట్టుకోవడానికి నీరు అదేవిధంగా కరెంట్ ఏర్పాటు చేస్తానని ఇళ్లపట్టాలలబ్ధిదారులకుభరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట వైస్సార్సీపి పార్టీ నాయకులు టౌన్ ఎస్.సి. సెల్ అధ్యక్షులు నరసయ్య మరియు బీసీ సంఘ నాయకులు అన్నం మురళి గౌడ్ తదితరులు ఉన్నారు.

## మే డే ను జయప్రదం చేయండి

నంద్యాల శనివారం నాడు జరిగే అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే ను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి ఎన్స్.శంకర్ పిలుపునిచ్చారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నూట ముప్పై ఐదు సంవత్సరాల క్రితం కార్మికులు అనేక పోరాటాలు ఉద్యమాలు వందల సంఖ్యలో కార్మికులు ప్రాణ త్యాగాల తో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం నిర్వీర్యం చేస్తూ సవరణల పేరిట కార్మికుల హక్కులను హరించివేస్తుంది అని ఆరోపించారు. రెండవ సారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ ప్రైవేటీకరణ ప్రక్రియను మరింత వేగంగా అమలు చేస్తూ లాభాల బాటలో పయనించే ప్రభుత్వ రంగ పరిశ్రమలను కారుచౌకగా బడా కార్పొరేట్ మరియు ప్రైవేటు కంపెనీలకు అమ్మ చూపడం బాధాకరమైన విషయమని ఆయన మన ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన చట్టాలను అమలు చేస్తూ కార్మికులు సాధించుకున్న ఎనిమిది గంటల పని దినాలు కరోనా సాకుతో 12 గంటల పనివిధానాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం కుట్రలు పన్నుతున్నారని దీన్ని కార్మికవర్గం ముక్తకంఠంతో ప్రతిఘటించాలని ఆయన కోరారు. 4 లేబర్ కోడ్ లను తక్షణమే రద్దు చేయాలని విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆలోచనను కేంద్ర ప్రభుత్వం విరమించుకోవాలని రైతుల ప్రయోజనాలు కీడు చేసే మూడు రైతు వ్యతిరేక నల్ల చట్టాలను తక్షణమే రద్దు చేయాలని ప్రైవేటీకరణ విధానాలకు స్వస్తి పలకాలని ఈ 135 మేడే సందర్భంగా కార్మికులు అంతా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం నంద్యాల పట్టణంలో జరిగే మేడే కార్యక్రమాన్ని ఐ ఎఫ్ టి యు నాయకులు కార్యకర్తలు సానుభూతిపరులు మేడే కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని ఐ ఎఫ్ టి యు జిల్లా సహాయ కార్యదర్శి ఎం శంకర్ పాల్గొన్నారు.

## శ్రీవారికి ప్రకృతి వ్యవసాయం బియ్యం, కూరగాయలు విరాళం

తిరుమల, ఏప్రిల్30 గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంతో దేశీయ వరి వంగడాలతో పండించిన బియ్యం, కూరగాయలు గురువారం తిరుమల శ్రీవారికి విరాళంగా అందాయి. కృష్ణా జిల్లా పినగూడురులంకకు చెందిన రైతు విజయరామ్ ఈ మేరకు బియ్యం, కూరగాయలను శ్రీవారి ఆలయం ఎదుట టిటిడి అదనపు ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మీడియాతో మాట్లాడుతూ గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంతో దేశీయ వరి వంగడాలతో పండించిన బియ్యంతో శ్రీవారికి నైవేద్యం సమర్పించాలని రైతు విజయరామ్ టిటిడి ఛైర్మన్, ఈవోను సంప్రదించారని చెప్పారు. ఈ మేరకు మొదటగా 10 రోజుల పాటు స్వామివారికి నైవేద్యం పెట్టే అన్నప్రసాదాల తయారీకి గాను 2200 కిలోల బియ్యం, కూరగాయలు, అరటిపండ్లు, బెల్లం, 15 కిలోల దేశీయ ఆవు నెయ్యి అందించారని తెలిపారు. ఈ బియ్యంలో ప్రొటీన్లు, ఫైబర్, విటమిన్లు పుష్కలంగా ఉన్నాయన్నారు. శుక్రవారం నుంచి ఈ బియ్యంతో తయారుచేసిన అన్నప్రసాదాలను స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తామని చెప్పారు. ఈ బియ్యం కావాల్సిన మోతాదులో దొరికితే రైతుల నుండే నేరుగా సేకరించి స్వామివారికి నైవేద్యంతోపాటు భక్తులకు అందించే అన్నప్రసాదాల తయారీకి కూడా వినియోగిస్తామన్నారు. ఎరువులు, పురుగుల మందులు వాడకుండా పండించిన ఇలాంటి వ్యవసాయ ఉత్పత్తులను వాడితే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. రైతు విజయరామ్ మాట్లాడుతూ శ్రీవారికి 365 రోజుల పాటు 365 రకాల దేశీయ వరి వంగడాల బియ్యంతో నైవేద్యం సమర్పించే అవకాశం కల్పించాలని టిటిడిని కోరారు. గో ఆధారిత వ్యవసాయం ద్వారా భూమి సారవంతమవుతుందని, ఇలాంటి ఉత్పత్తులను సమాజంలోని ప్రజలంతా వినియోగించాలని కోరారు.

## రాజధాని తరలింపు మూర్ఖపు నిర్ణయం

కడప అమరావతి నుండి విశాఖపట్నం కు రాజధాని ని తరలించాలన్న రాష్ట్ర ప్రభుత్వట నిర్ణయం పిచ్చి తుగ్గక్ చర్య అని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్రెడ్డి తులసిరెడ్డి మండిపడ్డారు. వేంపల్లి లో ఆయన స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. అభివృద్ధి వికేంద్రీకరణ పాలనవికేంద్రీకరణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కపట మాటలు చెబుతోంది అని అయన ఆరో?పించారు. గ్రామ,నగర పంచాయతి , మండల పరిషత్ , జిల్లా పరిషత్ లకు విధులు నిధులు కేటాయించకుండా పాలన వికేంద్రీకరణ ఏలా అవుతుంది దుయ్యబట్టారు. వెనుకబడిన రాయలసీమ , ఉత్తరాంధ్ర ఏడు జిల్లా లకు ప్రత్యేక ప్యాకేజి లు ఇవ్వకుండా అభివృద్ధి వికేంద్రీకరణ ఎలా అవుతుంది అని ప్రభుత్వం ను ప్రశ్నించారు. అమరావతి నుండి విశాఖపట్నం కు రాజధాని తరలించాలని ఏవరు అడిగారు. దీనివల్ల అందరూ సంతోషం గా లేరన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అభివృద్ధి వికేంద్రీకరణ కోసం కేంద్రం తో కొట్లాడి ప్రత్యేక హోదాను సంపాదించుకోలేక ఇలా దుర్మార్గం అన్న తులసిరెడ్డిరాజధాని వ్యవహారం లో జగన్ మూర్ఖ శికామని గా వ్యవహారిస్తున్నారు అని ఘాటైన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర రాజధాని అమరావతి పరిరక్షణ ఉద్యమానికి 500 రోజులు అయ్యిందని ఆర్థిక ఇబ్బందులు పరిపాలన ఇబ్బందులు లు ఉన్నప్పటికీ అమరావతి లో ఉన్న వసతులను కాదని విశాఖపట్నం కు వెళ్లాలని తీసుకున్న నిర్ణయం మూర్కుడి నిర్ణయమని అయన విమర్శించారు.

# ఉప్పరహాల్ గ్రామ మాదిగలకు న్యాయం జరిగేంతవరకు పోరాటం ఆగదు

ఎమ్మిగనూరు( విభారె) పట్టణంలో నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ కౌతాళం మండలంలోని ఉప్పరహాల్ గ్రామంలో దళితులపై జరిగిన సంఘటన పై పూర్తి స్థాయిలో విచారణ జరిపి మాదిగలకు న్యాయం చేయాలని నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ జిల్లా ఇంచార్జి చిక్కం జానయ్య మాదిగ మరియు జిల్లా అధికార ప్రతినిధి జయ్యన్నమాదిగ అన్నారు ఎమ్మిగనూరు నియోజకవర్గ నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి తీ.రవి మాదిగ,అధ్యక్షుడు నగేష్ మాదిగ, ఇంచార్జి మరెప్ప మాదిగ ఆధ్వర్యంలో జయ్యన్న మాదిగ మాట్లాడుతూ ఉప్పరహాల్ లో ఏప్రిల్ 14వ తేదీన అంబేద్కర్ జయంతి రోజున ×కురువ కులస్తులు ఒకేసారి 30 నుంచి 40 మంది వరకు దళితులపై దాడి చేస్తే కేవలం 16 మందిపై మాత్రమే కేసు నమోదు చేసి పోలీసులు నిర్లక్ష్యనీ వహిస్తున్నారని ,వేటకొడవాళ్ళతో మాదిగలపై దాడి చేస్తే హత్య ప్రయత్నం కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ చేసి న్యాయం చేయలేదని పోలీసులు నిర్లక్ష్యం వల్ల దళితులకు రక్షణ లేకుండా పోయిందని వారు వాపోయారు మరోసారి విచారణ జరిపి అంబేద్కర్ చిత్రపటాన్ని చించివేసి అవమానపరచిన వారిపై చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు అదే విదంగా అంబేద్కర్ చిత్రపటాని చించిన వారిపై మరియు దాడి చేసిన వారిని రిమాండ్కు పంపాలని నిర్లక్ష్యం వహించిన పోలీసులను విధుల నుంచి తొలగించాలని,ముద్దాయిల పైరాజద్రోహం కేసు నమోదు చేసి శిక్షించాలని ఉప్పరహాల్ గ్రామ మాదిగలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు ఉప్పరహాల్ గ్రామ మాదిగలకు రక్షణ కల్పించాలేని సమయంలో ఎలాంటి పోరాటం కైనా సిద్ధంగా నవ్యాంధ్ర ఎమ్మార్పీఎస్ ఉంటుందని వారు హెచ్చరించారు

# పదవతరగతి ఇంటర్ పరీక్షలు తక్షణమే వాయిదా వేయాలి

ఎమ్మిగనూరు ( విభారె) రాష్ట్రంలో పదవ తరగతి ఇంటర్ పరీక్షలను తక్షణమే వాయిదా వేయాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఉదయ్ డిమాండ్ చేశారు కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ తాసిల్దారు రాఘవేంద్ర గారికి వినతి పత్రం అందజేశారు ఈ యొక్క కార్యక్రమాన్ని ఉద్దేశించి ఉదయ్ మాట్లాడుతూదేశవ్యాప్తంగా కరోనా సెకండ్ వేవ్ విజృంభిస్తున్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరీక్షల పేరుతో విద్యార్థుల జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చుతుంది కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలు సైతం కారొనా విపత్కర పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని విద్యార్థులను ప్రమోట్ చేస్తే రాష్ట్ర ప్రభుత్వం మట్టుకు మొండి వైఖరితో ఏకపక్ష నిర్ణయాలతో తప్పనిసరిగా నిర్వహిస్తామని మొండి వైఖరితో ఉంది మూడు సార్లు సమీక్షలు జరిపిన కనీసం విద్యార్థుల పక్షాన ఆలోచించకుండా ఇంత విపత్కర పరిస్థితుల్లో పరీక్షలు నిర్వహించడానికి ఏకపక్ష వైఖరితో ప్రభుత్వం ముందుకు పోతుందని అదే విధంగా జిల్లాలో ఒక్క రోజుకు ఐదు వందలకు పైగా కేసులు నమోదవుతున్నాయి ఇలాంటి సందర్భంలో ఒక విద్యార్థి కోవిడ్ బారిన పడ్డ వారి కుటుంబాలు కూడా ఈ విపత్కర పరిస్థితి గురి కావాల్సి ఉంది అంతేకాక పరీక్షలు సజావుగా నిర్వహించాలంటే ఇన్విజిలేటర్స్ గా వెళ్లే ఉపాధ్యాయులు కరోనా బారినపడి మరణిస్తా ఉంటే ప్రభుత్వం మట్టుకు ఖచ్చితంగా నిర్వహించి తీరుతామని గౌరవ ముఖ్యమంత్రి అనటం సిగ్గుచేటు తక్షణమే పరీక్షలను వాయిదా వేయాలని లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం కు దిగుతామని హెచ్చరించారు ఈ ఈ కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి అజిత్ అనిల్ తదితరులు పాల్గొన్నారు

### కరోనా మృత దేహాలు తరలింపునకు ప్రణాళిక

రాజమహేంద్రవరం కరోనా విలయతాండవం చేస్తున్న ప్రస్తుత పరిస్థితులలో మృతదేహాలను తరలించే కార్యక్రమాన్ని మే 1 నుండి వైస్సార్సీపీ ఆధ్వర్యంలో నిర్వహించడానికి ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని రాజమహేంద్రవరం సిటీ కోఆర్డినేటర్ డా. ఆకుల సత్యనారాయణ తెలియజేసారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ.. కరోనా మృతదేహాల తరలింపులో కొంతమంది అమానుషంగా వ్యవహరిస్తున్నారని 35 వేలు నుంచి 50 వేల రూపాయలవరకు వసూలుచేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని అన్నారు, వెంటనే రోటరీ కైలాస భూమి నిర్వహిస్తున్న పట్టపగలు వెంకట్రావు తో చర్చించామని అన్నారు.. మృతదేహాల దహనం కోసం 10 లారీల కట్టెలను పంపుతామని, దహన కార్యక్రమాలకి స్వల్ప మొత్తం తీసుకుంటామని హామీఇచ్చారు. శుక్రవారం సాయంత్రనికి హెల్ప్ లైన్ నెంబర్లను ఏర్పాటు చేస్తామన్నారు.

# 40 ఏళ్లు పైబడిన స్త్రీ, పురుషులకు రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలు



కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతున్నప్పుడు, కొరోనావైరస్ నావల్ ఆకస్మికంగా వచ్చే చిక్కులు మరియు ఉత్పరివర్తనాల కారణంగా దేశంలోని ప్రభుత్వం మరియు ఆరోగ్య సంరక్షణ సంస్థలు మునిగిపోతున్నాయి. మీ చేతులను తరచుగా కడుక్కోవడం, సామాజిక దూరాన్ని కాపాడుకోవడం మరియు బయటికి వెళ్లడం వంటి పరిశుభ్రత ప్రమాణాలను ప్రస్తావించడం చాలా కీలకం అయితే, మీ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడం చాలా ముఖ్యం అని నిపుణులు జోడిస్తున్నారు - ఈ సమయంలో ఇది చాలా ముఖ్యమైనది. డయాబెటిస్, హైపర్‌టెన్షన్, కార్డియోవాస్కులర్ డిసీజ్, మరియు శ్వాసకోశ సమస్యలు వంటి కొన్ని ముందస్తు పరిస్థితుల్లో ఉన్న వ్యక్తులు సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఎక్కువగా ఉంది మరియు మీరు వయసు పెరిగేకొద్దీ సాధారణ రోగనిరోధక శక్తి తగ్గడంతో ఇది వయస్సుతో కూడా తీవ్రతరం అవుతుంది. మనందరికీ తెలిసినట్లుగా, మీరు తినే ఆహారం మీ మొత్తం ఆరోగ్యం మరియు రోగనిరోధక శక్తిని నిర?యించడంలో కీలకమైన అంశం. బాగా పనిచేసే రోగనిరోధక వ్యవస్థ వ్యవస్థ నుండి యాంటీబాడీస్ ప్రాణాంతక కణాలను తొలగించడానికి సహాయపడుతుంది. ఆహారం లేదా శరీరాల కణజాలం వంటి హానిచేయని బాహ్య ట్రిగ్గర్‌లకు వ్యతిరేకంగా రోగనిరోధక ప్రతిస్పందనలను నియంత్రించడంలో ఇది సహాయపడుతుంది. 40 సంవత్సరాల వయస్సు ఉన్నవారికి రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలు 40 సంవత్సరాల వయస్సు ఉన్నవారికి రోగనిరోధక శక్తి పెంచే ఆహారాలు 40 ఏళ్లు పైబడిన పురుషులు మరియు మహిళలకు, మీ శరీరం యొక్క రక్షణ వ్యవస్థ వయస్సుతో బలహీనంగా ఉంటుంది. వయస్సుతో పాటు రోగనిరోధక శక్తి ఎలా మరియు ఎందుకు తగ్గుతుందో తెలుసుకోవడానికి వైద్య సంఘం ఇంకా ప్రయత్నిస్తోందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. రోగనిరోధక శక్తి తగ్గినప్పుడు వయస్సు నిర?యించబడదు. అయినప్పటికీ, మీ ఆరోగ్య కరమైన ఆహారం బాగా తినడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం మరియు సమయానికి నిద్రపోవడం ద్వారా మీరు ఎల్లప్పుడూ దాని పైన గెలవవచ్చు. 40 ఏళ్లు పైబడిన పురుషులు మరియు మహిళలకు రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలు: గుడ్లు బచ్చలికూర పెరుగు సాల్మన్ చియా విత్తనాలు మొదలైనవి. 40 ఏళ్లు పైబడిన పురుషులు మరియు మహిళలకు రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలు 40 ఏళ్లు పైబడిన పురుషులు మరియు మహిళలకు రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలు 40 ఏళ్ళ వయస్సు, పోషక అవసరాలు మరియు జీవక్రియ రేట్లు తక్కువగా ఉంటుంది, అనగా, శరీరం చాలా మంది వ్యక్తులకు ఆహారాన్ని శక్తిగా మారుస్తుంది, గణనీయమైన మార్పుకు లోనవుతుంది. కరోనావైరస్ మహమ్మారి మధ్య, ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు, మీ చేతులను తరచుగా కడుక్కోవడం వంటి పరిశుభ్రత ప్రమాణాలను పేర్కొనడం చాలా ముఖ్యం - మీరు 40 ఏళ్లు పైబడి ఉంటే మీ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడం కూడా అంతే ముఖ్యం. 40 ఏళ్లు పైబడిన పురుషులు మరియు మహిళలకు రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాల జాబితా ఇక్కడ ఉంది. గుడ్లు మీ రోగనిరోధక శక్తిని మెరుగుపర్చడానికి అవసరమైన విటమిన్లు మరియు ఖనిజాల స్టోర్హౌస్లుగా నిర్వచించబడతాయి, ప్రత్యేకించి మీరు 40 ఏళ్లు పైబడి ఉంటే. 2. చేప: 2. చేప: సాల్మన్ మరియు ట్రౌట్ వంటి చేపలు మీ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో సహాయపడే ఆరోగ్యకరమైన కొవ్వులను కలిగి ఉంటాయి. ఈ ఆరోగ్యకరమైన కొవ్వులు మెదడు, గుండె మరియు ఉమ్మడి ఆరోగ్యానికి కూడా మద్దతు ఇస్తాయి, ముఖ్యంగా 40 ఏళ్లు పైబడిన మహిళలకు. 3. చియా విత్తనాలు: అతను ఒక నెలకి రూ. 1,800,000 ఎలా సంపాదిస్తాడో చూడండి! 3. చియా విత్తనాలు: యాంటీఆక్సిడెంట్లు మరియు వివిధ రకాల పోషకాలతో లోడ్ చేయబడిన చియా విత్తనాలు ద్రవాన్ని పీల్చుకునే మరియు జిలాటినస్ అనుగుణ్యతను పొందే ప్రత్యేక సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి.

# వేదిక మారినా హక్కులు మావే!

న్యూఢిల్లీ: భారత్‌లో కరోనా విజృంభణ నేపథ్యంలో టీ20 వరల్డ్ కప్ నిర్వహణపై మరోసారి సందేహాలు నెలకొన్నాయి. గతేడాది ఆస్ట్రేలియాలో నిర్వహించాల్సిన ఈ మెగా ఈవెంట్ వాయిదా పడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత్‌లో ఈ సంవత్సరం ద్వితీయార్ధం(అక్టోబర్-నవంబరు)లో టోర్నీ నిర్వహణకై బీసీసీఐ హక్కులు సొంతం చేసుకుంది. అయితే, ప్రస్తుతం దేశంలో కోవిడ్ రోజువారీ కేసులు 3 లక్షలకు పైగా నమోదు కావడం, కరోనా మరణాలు కూడా పెరుగుతుండటంతో వేదికగా మార్చే దిశగా సమాలోచనలు జరుపుతున్నారంటూ ప్రచారం జరుగుతోంది.ఈ విషయంపై బీసీసీఐ జనరల్ మేనేజర్, టీ20 ప్రపంచ కప్ టోర్నమెంట్ డైరెక్టర్ ధీరజ్ మల్హోత్రా స్పందించారు. “వరల్డ్ కప్ గురించి ఇప్పుడే మాట్లాడటం తొందరపాటు అవుతుందేమో. కానీ, ఒకవేళ దేశంలో పరిస్థితి ఇలాగే కొనసాగితే యూఏఈలో నిర్వహించే అంశం గురించి ఆలోచిస్తున్నాం. అయితే, హక్కులు మాత్రం బీసీసీఐవేవవ అని స్పష్టం చేశారు. కాగా అనేక సవాళ్లను అధిగమించి బయో బబుల్ నిబంధనల నడుమ బీసీసీఐ ఐపీఎల్‌ను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రేక్షకులు లేకుండానే క్యాష్ రిచ్ లీగ్ కొనసాగుతోంది.

# మెగాస్టార్ - సందీప్ వంగా కాంబోలో ఎలాంటి మూవీ ఎక్సపెక్ట్ చేయొచ్చు..?



మెగాస్టార్ చిరంజీవి సినిమాల్లోకి రీ ఎంట్రీ ఇచ్చిన తర్వాత వరుస సినిమాలు చేస్తూ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే cఆచార్యc షూటింగ్ ఫైనల్ స్టేజీకి తీసుకొచ్చిన చిరు.. దీని తర్వాత మోహన్ రాజా దర్శకత్వంలో cలూసిఫర్c తెలుగు రీమేక్ లో నటించనున్నాడు. ఇదే క్రమంలో మెహర్ రమేష్ తో cవేదళమ్c రీమేక్.. బాబీ దర్శకత్వంలో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే ఈ క్రమంలో డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా తో చిరంజీవి ఓ సినిమా చేసే అవకాశం ఉందని ఫిల్మ్ సర్కిల్స్ లో టాక్ వినిపిస్తోంది.ఇటీవల చిరంజీవితో సందీప్ వంగా మీటింగ్ జరిగినట్లు గత రెండు రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇది సినిమా కోసమా లేక మామూలు సమావేశమా అనేది తెలియనప్పటికీ.. వీరు సినిమా విషయమై చర్చలు జరిపినట్లు టాక్ నడుస్తోంది. ఇప్పటికే స్టోరీ లైన్ విన్న చిరు.. ఒకవేళ సందీప్ స్క్రిప్టుతో మెప్పిస్తే ఈ ప్రాజెక్ట్ ను ఫైనలైజ్ చేసే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో ఇదే కనుక నిజమైతే cఅర్జున్ రెడ్డిc వంటి సెన్సేషనల్ సినిమా తెరకెక్కించిన సందీప్ వంగా.. మెగాస్టార్ తో ఎలాంటి సినిమా చేస్తాడనేది ఆసక్తికరంగా మారింది.ప్రస్తుతం చిరు చేస్తున్న సినిమాలన్నీ కమర్షియల్ ఎంటర్టైనర్స్. ఆయనకున్న ఇమేజ్ ని వయసుకి దృష్టిలో పెట్టుకొని పాత్రలను ఎంచుకుంటున్నారు. అయితే రెండు సినిమాల అనుభవమున్న సందీప్ రా అండ్ రస్టిక్ సబ్జెక్ట్ నే డీల్ చేసాడు. ఈ క్రమంలో బాలీవుడ్ లో మరో ప్రాజెక్ట్ కమిట్ అయ్యాడు. రణ్ బీర్ కపూర్ హీరోగా cయానిమల్c అనే సినిమా తెరకెక్కిస్తున్నాడు. ఇది గ్యాంగ్ స్టర్ కథాంశంతో రూపొందే ఓ క్రైమ్ డ్రామా అని తెలుస్తోంది. సందీప్ ఇప్పుడు చిరంజీవి తో సినిమా చేసినా ప్రేక్షకులు తప్పకుండా వారి నుంచి వైవిధ్యాన్ని కోరుకుంటారు. ఈ నేపథ్యంలో చిరు ఇంతకుముందు చేయని గ్యాంగ్ స్టర్ - డాన్ తరహా సినిమా చేస్తే బాగుంటుందని అభిమానులు భావిస్తున్నారు. మరి మెగాస్టార్ తో సందీప్ ఎలాంటి సినిమా ప్లాన్ చేస్తారో చూడాలి.


# ఆలియాపై వచ్చినట్టే దీపికపైనా రూమర్స్

ఇంతకుముందు ఆర్.ఆర్.ఆర్ చిత్రంలో నటిస్తున్న ఆలియా వల్ల రాజమౌళికి చిక్కులు వచ్చి పడ్డాయని ప్రచారమైంది. ఆలియా వరుస సినిమాలతో బిజీగా ఉండడం వల్ల ఇచ్చిన కమిట్ మెంట్ నెరవేర్చలేకపోతోందని ఆర్.ఆర్.ఆర్ నుంచి ఈ బ్యూటీ వైదొలగిందని కూడా ప్రచారం సాగిపోయింది. కట్ చేస్తే అన్ని సమస్యల్ని పరిష్కరించుకుని రాజమౌళి తన వైపునకు ఆలియాను తిప్పేసుకున్నారు.ఆలియా అవసరం మేర దర్శకుడికి సహకారం అందించింది. తదుపరి షెడ్యూల్ కి అందుబాటులో ఉంటానని ఇటీవల కోవిడ్ నుంచి కోలుకున్న ఆలియా రాజమౌళికి చెప్పారని కథనాలొచ్చాయి.ఇప్పుడు ఇంచుమించు దీపిక పదుకొనే పైనా టాలీవుడ్ లో అలాంటి రూమర్లు స్ప్రెడ్ అవుతున్నాయి. ప్రభాస్ - నాగ్ అశ్విన్ కాంబినేషన్ లో వైజయంతి మూవీస్ నిర్మించే పాన్ వరల్డ్ మూవీలో దీపిక నటించాల్సి ఉండగా.. తన నుంచి నిర్మాతలకు సరైన స్పందన లేదని ఫోన్ లో సంప్రదించినా అస్సలు స్పందించడం లేదని రకరకాల కథనాలు వైరల్ అవుతున్నాయి.నిజానికి దీపికతో ప్రభాస్ మూవీకి చిక్కులు తప్పవని అతడి అభిమానులు కూడా తనని హేట్ చేస్తూ హ్యాష్ ట్యాగ్ లు వైరల్ చేస్తున్నారు. తాను లేడీ సూపర్ స్టార్ అని ప్రభాస్ ని డామినేట్ చేయాలన్న అహంతో ఉంటుందనేది అభిమానుల ఆరోపణ.నిజానికి దీపిక పదుకొనే ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. హృతిక్ రోషన్ తో ఓ సినిమా చేస్తున్న దీపిక అమితాబ్ తో కలిసి హాలీవుడ్ బ్లాక్ బస్టర్ ఇంటర్న్ రీమేక్ లో నటించనున్నారు. అలాగే ద్రౌపది అనే చిత్రంలోనూ నటిస్తారు. ఓవైపు కోవిడ్ షెడ్యూళ్లను అమాంతం మార్చేసింది. దీంతో అటు బాలీవుడ్ సినిమాలకు ఇటు తెలుగు సినిమాలకు కాల్షీట్ల సర్దుబాటులో సమస్యలు తలెత్తనున్నాయని అంచనా వేస్తున్నారు.బాలీవుడ్ లో లేట్ అవుతున్నవన్నీ అక్టోబర్ లో ప్రారంభమయ్యే అవకాశం ఉంది. అయితే అప్పటికి నాగ్ అశ్విన్ - ప్రభాస్ సినిమా ప్రారంభమైతే దీపిక కాల్షీట్లతో సమస్య ఏర్పడవచ్చని భావిస్తున్నారు.



# ప్లీజ్ డార్లింగ్ డైలాగ్ కాస్త చిన్నగా చెప్పవా

బాహుబలి తో ప్రభాస్ ఆల్ ఇండియా సూపర్ స్టార్ గా గుర్తింపు దక్కించుకున్నాడు. ప్రభాస్ ప్రస్తుతం చేస్తున్న సినిమాల విలువ రెండు వేల కోట్లకు పైగా ఉంది. ఇండియాలో ప్రస్తుతం బిగ్గెస్ట్ స్టార్ ప్రభాస్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అంతటి క్రేజ్ ఉన్న ప్రభాస్ సిప్లిసిటీ విషయంలోనూ నెం.1 అనిపించుకుంటూ ఉంటాడు. తన చుట్టు ఉన్న వారిని గౌరవిస్తూ ఉండే ప్రభాస్ తన సినిమాల్లో నటించే జూనియర్ ఆర్టిస్టులను కూడా గౌరవ ప్రథంగానే చూస్తూ ఉంటాడు. గతంలో ప్రభాస్ సినిమాల్లో నటించిన వారు ఎంతో మంది ఈ విషయాన్ని చెప్పారు. తాజాగా ప్రభాస్ గురించిన అదే విషయాన్ని డబ్బింగ్ ఆర్టిస్టు కమ్ సీనియర్ మోస్ట్ జూనియర్ ఆర్టిస్టు కొసరాజు ఆదిత్య చెప్పుకొచ్చాడు.బాహుబలి సినిమాలో కొసరాజు ఆదిత్య చిన్న పాత్రలో కనిపించాడు. సినిమాలో ఆయన కనిపించింది. అతి తక్కువ సమయం మాత్రమే. అయినా కూడా జీవితాంతం గుర్తుండి పోయే సంఘటన తనకు బాహుబలి సినిమా షూటింగ్ సందర్భంగా జరిగిందని చెప్పుకొచ్చాడు. తాజా ఇంటర్వ్యూలో కొసరాజు ఆదిత్య మాట్లాడుతూ.. యుద్దం మొదలు అయ్యే సమయంలో నేను డైలాగ్ చెప్పిన తర్వాత ప్రభాస్ చెప్పాల్సి ఉంటుంది. నేను నా డైలాగ్ చెప్పాను. ఆ సమయంలో నా దగ్గరకు ప్రభాస్ వచ్చాడు. నేను చాలా నర్వస్ ఫీల్ అయ్యాను. అప్పుడే మెల్లగా డార్లింగ్ డైలాగ్ కాస్త చిన్నగా చెప్పవా తర్వాత నేను చెప్పాల్సిన డైలాగ్ మర్చి పోతున్నాను అన్నాడు.స్టార్ హీరో అయిన ప్రభాస్ ఒక చిన్న ఆర్టిస్టు వద్దకు వచ్చి డైలాగ్ చిన్నగా చెప్పవా డార్లింగ్ అనడం అంటే మామూలు విషయం కాదు. ఆయన సింప్లిసిటీకి ఇదే ఒక నిదర్శణం అనుకోవచ్చు అంటూ కొసరాజు ఆదిత్య అన్నాడు. బాహుబలి సినిమా షూటింగ్ సమయంలో ప్రభాస్ రాక కోసం చిత్ర యూనిట్ సభ్యులు అందరితో పాటు 2000 మంది సైనికుల వేశంలో ఉన్న వారు వెయిట్ చేసే వారు. ప్రభాస్ కార్ వాన్ నుండి దిగుతున్నాడు అనగానే రెండు వేల మంది సైనికులు అప్రమత్తం అయ్యే వారు. అప్పట్లో రాజులు ఉంటే ఇలాగే సైనికులు గౌరవం ఇచ్చేవారేమో అనిపించింది. బాహుబలి సినిమాను తన జీవితాంతం మర్చిపోలేను అంటూ ఆదిత్య చెప్పుకొచ్చాడు.



# ‘ఎఫ్ 3 రిలీజ్ కు అదే సెంటిమెంట్ ?

సినిమావాళ్లకు సెంటిమెంట్స్ ఎక్కువ. కోట్లతో నడిచే వ్యాపారం కాబట్టి ఎవరి భయాలు వాళ్లకు ఉంటాయి. దాంతో రకరకాల సెంటిమెంట్స్ వచ్చి చేరతాయి. కొందరు టైటిల్స్ విషయంలో సెంటిమెంట్ కు వెళ్తే మరికొందరు రిలీజ్ డేట్ విషయంలో సెంటిమెంట్ చూపిస్తారు. ఇప్పుడు అనీల్ రావిపూడి కూడా తన తాజా చిత్రం ఎఫ్ 3 విషయంలో అదే సెంటిమెంట్ ని ఫాలో అవుతున్నాడని వినపడుతోంది.వెంకటేశ్ వరుణ్ తేజ్ కలిసి నటిస్తున్న చిత్రం ‘ఎఫ్ 3వ. అనిల్ రావిపూడి దర్శకుడు. తమన్నా మెహరీన్ హీరోయిన్స్. ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తి అనుకున్న సమయంలో ఏప్రియల్ 13న అనీల్ రావిపూడి కోవిడ్ బారిన పడ్డారు. దాంతో ఐసోలేషన్ కు వెళ్ళారు. ఇప్పుడు ఆయనకు నెగిటివ్ వచ్చిందని అఫీషియల్ గా ప్రకటించారు. అలాగని ఇప్పటికిప్పుడు షూటింగ్ ప్రారంభించే పరిస్దితి లేదు. కరోనా కాస్త కంట్రోలులోకి వచ్చాక ప్రారంభించినా రిలీజ్ డేట్స్ దొరికేటట్లు కనపడటం లేదు. దాంతో ఈ సినిమాని తన సెంటిమెంట్ అయిన సంక్రాంతికి విడుదల చేస్తే బాగుంటుందనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.2019 సంక్రాంతికు వచ్చిన తన ఎఫ్ 2 చిత్రం కలెక్షన్స్ పరంగా ఓ ఊపు ఊపేసింది భారీ కమర్షియల్ హిట్ గా నిలిచింది. ఆ తర్వాత సరిలేరు నీకెవ్వరూ అంటూ మహేష్ తో చేసిన చిత్రం కూడా సంక్రాంతికి విడుదల అయి.. సక్సెస్ అయ్యింది. దాంతో ఎఫ్ 3 కూడా సంక్రాంతికి రిలీజ్ చేస్తే నిర్ణయం నిర్మాత దగ్గర వ్యక్తం చేసినట్లు సమాచారం. వాస్తవానికి ఆగస్టు 27న ఈ చిత్రం విడుదల ప్లాన్ చేసారు. కానీ ఇప్పుడున్న సిట్యువేషన్ లో ఆగస్టులో వరస సినిమా రిలీజ్ లు ఉండటం తో థియోటర్స్ ఎడ్జెస్ట్ చేయటం చాలా కష్టం.ఇక ఈ సినిమాను శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్రాజు నిర్మిస్తున్నారు. దేవీ శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.అనిల్ రావిపూడి-వెంకటేశ్-వరుణ్ కలయికలో గతంలో వచ్చిన ‘ఎఫ్ 2వకి సీక్వెల్గా రూపొందుతుందీ ‘ఎఫ్ 3వ. ఎఫ్ 2 మంచి సక్సెస్ అందుకోవడంతో ఎఫ్ 3పై ఎక్సపెక్టేషన్స్ పెరుగుతున్నాయి. ఎఫ్3లో సినిమా కథ డబ్బు సంపాదన చుట్టూ తిరుగుతుండట. సునీల్ పాత్ర ప్రత్యేక ఆకర్షణ అవుతుందని చెప్తున్నారు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**